రైతుల ఖాతాల్లో రూ.60.36 కోట్ల జమ

నెల్లూరు (హరనాథపురం) మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ఇప్పటిదాకా రూ.60.36 కోట్లు జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 32,275 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. శనివారం ఒక్కరోజే 4,363.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 నుంచి 48 గంటల్లోగా వారి ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు

బహుమతుల బొనాంజా

'కార్ అండ్ బైక్ రేస్' విజేతల ప్రకటన

కూపన్లు తీసి విజేతలను ప్రకటించిన ఎమ్మెల్యే ప్రశాంతి, 'శుభమస్తు' అధినేత బయ్యా రవి

- **ప్రథమ బహుమతి**
  ఎస్‌కే. మస్తాన్‌బీ, 4/23-5, శ్రామికనగర్ రోడ్, కొత్తూరు, నెల్లూరు.
- **ద్వితీయ బహుమతి**
  పొన్నూరు గిరిబాబు, 7-8-40, కోటంరెడ్డివారి వీధి, కావలి
- **తృతీయ బహుమతి**
  మేకల రాజేశ్వరి, 26-3-883, జ్యోతినగర్, 6వ వీధి, వేదాయపాళెం, నెల్లూరు.
- **వంద మందికి కన్సొలేషన్ బహుమతులు**

అక్షరమే ఆయుధంగా పునఃప్రారంభమైన ఆంధ్రజ్యోతి జనాదరణే ఊపిరిగా 22 ఏళ్ల పూర్తి చేసుకున్నది. ఇన్నేళ్ల ప్రస్థానంలో చురకలంటించే కథనాలతోపాటు ఆదరాభిమానం చూపుతున్న పాఠకులకు ఎన్నో బహుమతులు అందజేస్తోంది. అందులోభాగంగా 22వ వార్షికోత్సవం సందర్భంగా 'కార్ అండ్ బైక్ రేస్' పేరిట పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024, నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కూపన్లను పాఠకులు ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపారు. ఇలా వేలాదిగా వచ్చిన కూపన్లలో విజేతలను శనివారం సాయంత్రం నెల్లూరులోని ప్రధాన కార్యాలయం వద్ద ఎంపిక చేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా రవి, ఏజెంట్లు, పాఠకులు పాల్గొన్నారు. ముందుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అతిథులు ఎంపిక చేయగా, వంద కన్సొలేషన్ బహుమతుల విజేతలను ఏజెంట్లు, పాఠకులు కూపన్ల ద్వారా ప్రకటించారు.

వివరాలు 8లో..



వేలాది కూపన్ల నుంచి ప్రథమ బహుమతి విజేత డ్రా తీస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కంగ్రాట్స్ మా... బైక్ విజేత మస్తాన్‌బీని ఫోన్‌లో అభినందిస్తున్న ప్రశాంతి రెడ్డి



ద్వితీయ బహుమతి విజేత కూపన్‌ను చూపుతున్న బయ్యా రవి



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (ఆదివారం సాయంత్రం)

సహరి : 4.55 (సోమవారం ఉదయం)

మండల సమాఖ్య పుస్తక నిర్వహణ చూడాల్సిన అకౌంటెంట్లు అంతులేని అవినీతికి, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. జిల్లాలో 37 మండలాలుండగా మండలానికో 37 సమాఖ్య ఉంది. వీటిలో 37 మంది అకౌంటెంట్లు పనిచేస్తున్నారు. సమాఖ్య తీర్మానంతో ఈ అకౌంటెంట్లు నియమితులవుతారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.3వేల పారితోషికం ఇస్తోంది. మండల సమాఖ్య కూడా కొంత పారితోషికం ఇస్తుంది. వీరు సమాఖ్య పుస్తక నిర్వహణ బాధ్యత చూడాలి. అయితే చాలాచోట్ల అకౌంటెంట్లు సమాఖ్య అధ్యక్షురాలికి సహాయకులుగా కాకుండా సమాఖ్య అధిపతులుగా చలామణి అవుతున్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అదే మండలంలో ఏళ్ల తరబడి పని చేస్తూ అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నారు.

- మండల సమాఖ్యల్లో అకౌంటెంట్ల చేతివాటం
- ఏళ్ల తరబడి ఒక దగ్గరే పని
- అన్నింటా వారిదే పెత్తనం
- దొంగ బిల్లులతో నిధుల స్వాహా..!
- రుణ రికవరీలో తప్పుడు సమాచారం
- విచారణ అధికారులకు తప్పుదోవ...
- ఉద్యోగుల్లేకనే వేతనాలు జేబులోకి..

అంతులేని అవినీతి



నెల్లూరు (హరనాథపురం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల సమాఖ్య అకౌంటెంట్లు ఇష్టారాజ్యం విధులు నిర్వహిస్తున్నారు. సమాఖ్య నిధులను అనుకూలమైన సభ్యులకు రుణాలుగా అందజేస్తున్నా రు. ఇందుకుగాను వారి నుంచి కొంత నగదు తీసుకుంటున్నట్లు ఆరోపణలు న్నాయి. అంతేకాదు రుణాల రికవరీ విషయంలో తప్పుడు లెక్కలు చూపుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నట్లు సమాచారం. నిధుల దుర్విని యోగంపై విచారణకు అధికారులు మండల సమాఖ్యలకు వెళ్లినప్పుడు అకౌంటెంట్లు వాస్తవాలను దాచిపెడుతున్నారని, విచారణ అధికారులకు సరైన సమాచారం ఇవ్వకుండా వారిని తప్పుదోవ పట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. తమపై వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు కాకుండా జాగ్రత్తలు తీసుకుం టున్నారు.

నకిలీ బిల్లులతో స్వాహా..

ప్రభుత్వం వివిధ కార్యక్రమాల నిర్వహణ, సభ్యుల వీక్షణ, కార్యాలయ నిర్వహణకు మండల సమాఖ్యలకు నిధులు మంజూరు చేస్తుంది. అయితే ఈ నిధులను ఆయా కార్యక్రమాల కోసం వినియోగించకుండానే, వాటికే ఖర్చు చేసినట్లు నకిలీ బిల్లులు చూపి అకౌంటెంట్లు నిధులు స్వాహా చేస్తున్నట్లు సమాచారం. కొందరు సమయపాలన పాటించ కుండా తమకు తోచినప్పుడు కార్యాలయాలకు వచ్చి వెళుతున్నారు. మరికొందరు కొందరు రాజకీయ నాయకులతో సత్సంబంధాలు పెట్టుకుని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లుగా దర్పం చూపుతున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాదు, గ్రామ సమాఖ్య సహాయకులు (వీవోఏ)లేని సమాఖ్యల్లో వారికి అనుకూలమైన వారిని అకౌంటెంట్లు, వీవోఏలుగా నియమించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి ప్రతి నెల గౌరవ వేతనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారు. ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేస్తే ఆ వేతనాన్ని వీరే వాడుకుంటూ అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా చేతివాటం చూపు తున్న అకౌంటెంట్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం



మండల సమాఖ్యల అకౌంటెంట్లు వారి బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. తరచూ మండల సమాఖ్యలో తనిఖీలు నిర్వహిస్తాం. పుస్తకాలను తనిఖీ చేస్తాం. అకౌంటెంట్లు మండల సమాఖ్య పుస్తక నిర్వహణ చూడాలే తప్ప, ఇతర రాజకీయ అంశాల్లో తలదూర్చినా, అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవు.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

పట్టా భూములతో సమానంగా

పరిహారం చెల్లించాలి

చేవూరు గ్రామసభలో అసైన్డ్ రైతుల మొర

గుడ్లూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా చేవూరు పరిధిలో ఏర్పాటు చేయనున్న (మారిటైమ్ బోర్డు) పరిశ్రమల ఏర్పాటుకు సేకరించే భూములలో పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. భూ సేకరణపై రైతుల అభిప్రాయ సేకరణకు శనివారం మండలంలోని చేవూరులో కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ పాల్గొని రైతుల అభిప్రాయాలు, సమస్యలపై రాతపూర్వకంగా వినతులు స్వీకరించారు. రైతులు మాట్లాడుతూ పట్టా భూముల కంటే అసైన్డ్ భూములకు నష్టపరిహారం తగ్గించడం సరైనది కాదని, పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే గత నెల 25న ఇచ్చిన నోటిఫికేషన్ సవరించాలన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ వాస్తవ లబ్ధిదారులను గుర్తించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ అసైన్డ్ భూములు చేతులు మారి అగ్రిమెంట్‌లు రాయించుకున్న క్రమంలో కొనుగోలు చేసిన రైతుల నుంచి సమస్యలు తలెత్తుతున్నా యని, వీటిని పరిష్కరించే దిశగా గ్రామంలో ఐదుగురు పెద్దలతో కమిటీ ఏర్పాటు చేసి వారి నిర్ణయానికి అనుగుణంగా అర్హులకు న్యాయం చేస్తామ న్నారు. అనంతరం మోచర్ల, చేవూరు, చినటాలవరపి గ్రామ పంచాయతీలకు మంజూరైన చెత్త సేకరణ ట్రాక్టర్లను ప్రారంభించి ఆయా పంచాయతీ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దారు స్వర్ణ, ఎంపీడీవో వెంకటే శ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పీ.మురళి, జీ.శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసులు, గొల్లప్రోలు హరిప్రసాద్, నూతలపాటి బుల్లియ్య పాల్గొన్నారు.



గ్రామసభలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ, పక్కన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

మొగళ్లపాళెం..

ఎప్పటికి మోక్షం!

అత్యాధునిక క్రీడావసతులు ఏర్పాటు చేసి జాతీయ స్థాయి క్రీడల నిర్వహణతోపాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించిన మొగళ్లపాళెం క్రీడా గ్రామానికి గ్రహణం పట్టింది. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అందులో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసినా ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, శాప్ చైర్మన్ సైతం దీన్ని పరిశీలించి వెంటనే ప్రారంభిస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా మోక్షం కలగడం లేదు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

- నేటికీ ప్రారంభం కాని ఇండోర్ స్టేడియం
- కోట్లాది రూపాయల ఖర్చు వృథాయేనా?
- పూర్తిస్థాయిలో నిర్మాణాలకు నోచుకోని క్రీడాగ్రామం
- వినియోగంలోకి తేవాలంటున్న కీడ్రాకారులు



ప్రారంభానికి నోచుకోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం లోపలి భాగం

రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మకమైన క్రీడామైదానంగా తీర్చి దిద్దడంతోపాటు జాతీయ క్రీడల నిర్వ హణే లక్ష్యంగా నెల్లూరు రూరల్ ప్రాంతంలోని మొగళ్ల పాళెంలో 2014లో క్రీడా గ్రామం కోసం 150 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించి పంపాలని నాటి కేంద్రమంత్రి ఎం.వెంకయ్య నాయుడు రాష్ట్ర సర్కారును కోరారు. 2016లో 150 ఎకరాలు శాప్ ఆధ్వర్యంలోకి వచ్చింది. అవుట్‌డోర్, ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని నెలకొల్పేందుకు అనువుగా భవనాలు నిర్మించేలా కేంద్ర సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర సర్కారు ఇందుకోసం శాప్ ద్వారా ప్రహరీగోడ, విద్యుత్, రోడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు రూ.4.6 కోట్లు విడుదల చేసింది. ఈ క్రీడాగ్రామం కోసం మరో రూ.200 కోట్లతో అంతర్జాతీయ క్రీడా ప్రమాణాల కలిగిన క్రీడా ప్రాంగణాలు రూపుదిద్దుకునే అవకాశం ఉందని వెంకయ్య నాయుడు సూచనలు చేసినా నాటి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యత చూపలేక పోయింది. 2016లో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేయగా, ఈ నిధులను భూ సేకరణలో భాగంగా రైతులకు చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. అనంతరం పట్టించుకోకపోవ డంతో ఈ జాప్యాన్ని గుర్తించిన కేంద్ర సర్కారు వెంకయ్య నాయుడు ఆదేశాలతో తొలిదశలో రూ.8కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టేందుకు 2017, మార్చిలో పనులు ప్రారంభిం చారు. ప్రస్తుతం ఇండోర్ నిర్మాణాలు మాత్రం పూర్తయి వినియోగానికి సిద్ధంగా ఉండగా మిగిలిన మైదానాల నిర్మాణాలు మాత్రం పనులు నేటికీ ప్రారంభించక పోవడంతో అసలు ఇది పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధత అందరిలో నెలకొంది.

రూ.కోట్ల ఖర్చు వృథాయేనా?

మొగళ్లపాళెం క్రీడా గ్రామంలో ఇప్పటికే రూ.3కోట్లతో ప్రహరీ, రూ.10 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణాలు పూర్తి చేసి 2022లోనే డీఎస్‌ఏకు అప్పగించారు. అనంతరం లక్ష లీటర్ల కెపాసిటీ కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను రూ.40లక్షలతో నిర్మించి రూ.10లక్షలతో వాటర్ పైప్‌లైన్‌లు కూడా సిద్ధం చేశారు. అలాగే రూ.46 లక్షలో విద్యుత్ సౌకర్యం కల్పించారు.

స్పోర్ట్స్ హబ్‌గా మారిస్తే..

మొగళ్లపాళెం స్పోర్ట్స్ కాంప్లెక్స్, శాయ్ రీజనల్ సెంటర్ ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తే క్రీడా గ్రామం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకుంటుంది. వసతులు కలిగిన అత్యాధునిక క్రీడా అకాడమీలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. వందలాది మంది క్రీడాకారులకు అకాడమీల్లో శిక్షణ అందిస్తే దేశం గర్వించేస్థాయి క్రీడాకారులు సిద్ధమవుతారని క్రీడా ప్రముఖులు చెపుతున్నారు. అంతేగాక క్రీడాగ్రామం పూర్తయితే దక్షిణ భారతంలోనే అతిపెద్ద స్పోర్ట్స్ హబ్‌గా మొగళ్లపాళెం మారే అవకాశం ఉంది. జాతీయ రహదారులు, తిరుపతి, చెన్నై విమానాశ్రయాలు అతి చేరువలో ఉండటం కూడా జిల్లాకు మరో అనుకూల అవకాశంగా మారనుంది. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి క్రీడాగ్రామం పూర్తిస్థాయి నిర్మాణానికి చొరవ చూపాలని క్రీడాప్రముఖులు, క్రీడాకారులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్నతాధికారులు, శాప్ చైర్మన్ సైతం వీటిని పరిశీలించి త్వరలోనే వినియోగంలోకి తెస్తున్నా మని ప్రకటించి నెలలు గడుస్తున్నా నేటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పూర్తయిన నిర్మాణాలకు ఇద్దరు వాచ్‌మెన్‌లను నియమించడం మినహా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణ యాలు తీసుకోక పోవడంతో క్రీడాకా రులు, క్రీడాభిమానులు నిరాశలో ఉన్నారు. క్రీడాగ్రామాన్ని ఏర్పాటు చేసే విష యంలో నత్తనడక నడుస్తుండటంతో 150 ఎకరాల ప్రభుత్వ భూమి నేటికీ వృథాగానే మిగిలి ఉంది.

రాజుపాళెం ఇసుక రీచ్ మూసివేత

కలువాయి, (ఆంధ్రజ్యోతి): రాజుపాళెం సమీపాన అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం రెవెన్యూ అధికారులు మూసివేశారు. వీఆర్వో వెంకటరమణయ్య రీచ్‌లోని వెళ్లే దారికి ఉన్న గేటు మూసి, రీచ్‌లోకి వాహనాలకు ప్రవేశం లేదని, ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు పెట్టారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'ఇంత బరితెగింపా?' అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు రెవెన్యూ అధికారులు స్పందించారు. రీచ్ నుంచి ఇసుక తరలిస్తే, వాహనాలను స్వాధీనం చేసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు శ్యామ్ సుందర రాజు హెచ్చరించారు. కుల్లూరులోని ప్రభుత్వ భూమి వద్ద కూడా బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మితిమీరిన వేగం..

ప్రాణాలు తీసింది!

- ఆటోను ఢీకొట్టిన మోటార్‌సైకిల్
- ముగ్గురు మృతి.. మరో ముగ్గురికి గాయాలు



ఆటోను ఢీకొట్టిన మోటార్‌సైకిల్

మనుబోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : 'మితిమీరిన వేగం.. అత్యంత ప్రమాదకరం. శిరస్త్రాణం ధరించి వాహనం నడపండి. ప్రాణాలు కాపాడుకోండి.' ఇలాంటి హెచ్చరికలు పోలీసులు పదే పదే చేస్తున్నా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. స్నేహితులను కలిసిన ఆనందం.. మోటార్‌సైకిల్‌పై సవారీ చేస్తూ చేసిన చిన్న పొరపాటు ముగ్గురి ప్రాణాలను బలిగొంది. మూడు కుటుంబాలకు తీరని శోకం మిగిల్చింది. మనుబోలు మండలం గొట్లపాళెం-వడ్లపూడి రహదారిపై శనివారం ఆటోను బైక్ ఢీకొంది. దీంతో వరుణ్‌కుమార్ (17), నంద కిషోర్ (18), ఆటో డ్రైవర్ తురకా సురేంద్ర (38) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు..

సైదాపురం మండలం ఊటుకూరుకు చెందిన నోసిన వరుణ్‌కుమార్ ఇంటర్ పరీక్షలు రాసి అమ్మమ్మ ఊరు అయిన మనుబోలు మండలం గొట్లపాళెంకు నాలుగురోజుల క్రితం వచ్చాడు. స్నేహితులైన అరసనాపల్లి నందకిషోర్, సిద్దులు వరుణ్‌ను చూసేందుకు ఊటుకూరు నుంచి బైక్‌పై గొట్లపాళెం వచ్చారు. వరుణ్‌ను తీసుకుని అదే బైక్‌పై వడ్లపూడికి వెళ్లారు. అక్కడి పొలాల్లో పని చేస్తున్న వరికోత యంత్రాల వద్ద ఊటుకూరు వాసులతో మాట్లాడారు. తిరిగి గొట్లపాళెం వచ్చేందుకు ముగ్గురు మోటార్ సైకిల్‌పై బయలు దేరగా మార్గమధ్యంలో ఓ గేదె అడ్డు రాగా దానిని తప్పించారు. మితి మీరిన వేగంతో వస్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. దీంతో మోటార్ సైకిల్ బోల్తా పడటంతో వరుణ్ కుమార్, నందకి షోర్ అక్కడకక్కడే దుర్మరణం చెందారు. సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి.



సురేంద్ర మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య



మనవడు వరుణ్‌కుమార్ మృతదేహాన్ని ఒళ్లో పడుకోబెట్టుకుని విలపిస్తున్న తాత

- వడ్లపూడి గ్రామానికి చెందిన తురకా సురేంద్ర ఐదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు కలరు. నిత్యం పొదలకూరు నుంచి వడ్లపూడి వరకు ప్రయాణికులను తీసుకువస్తుంటాడు. ఈక్రమంలో ఇద్దరు ప్రయాణికులతో సురేంద్ర ఆటోలో వస్తుండగా మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ సురేంద్రకు, ఆటోలో ఉన్న ఇద్దరుకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో పొదలకూరు సీహెచ్‌సీకి తరలించారు. కొద్ది నిమిషాలకే చికిత్స పొందుతూ సురేంద్ర ఆసుపత్రిలో చనిపోయాడు. విషయం తెలుసుకుని ఎస్‌ఐ శివరాకేష్, నెల్లూరు డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ప్రమాదస్థలికి చేరుకుని, పరిశీలించారు. మృతుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఘటనాస్థలి వద్ద మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. మరోపక్క పొదలకూరు సీహెచ్‌సీలో మృతుడు సురేంద్ర భార్య, బిడ్డల గుండెలవిసేలా విల పించారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాలను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నందకిషోర్ మృతదేహం

నీటి ఆవశ్యకతపై అవగాహన సదస్సు

ఉదయగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం పడ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నీటి ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర సంస్థ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మజ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి విక్రమ్, అధ్యాపకులు అన్వార్, పుష్పమ్మ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8477
వెండి కిలో ధర	రూ. 1,00,000
వెండి ఒక గ్రాము	రూ.103.00

పందేలు కాస్తే కఠిన చర్యలు


సీఐ వేమారెడ్డి

సంగం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): క్రికెట్‌పై పందేలు కాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వేమారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో మాట్లాడారు. సంగం, చేజర్ల, ఏఎస్‌పేట ఎస్‌ఐల ఆధ్వర్యంలో క్రికెట్ పందేలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. బెట్టింగ్‌లపై స్థానిక పోలీసులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. అన్ని గ్రామాలు, ప్రాంతాల్లో సంచరిస్తూ బెట్టింగ్ వ్యవహారాలపై నిఘా ఉంచుతామని వివరించారు. యువత బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు గిరిజనుల ధర్నా

అనంతసాగరం మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సోమవారం అనంతసాగరంలో గిరిజనులు ధర్నా నిర్వహించనున్నట్లు మండల సీపీఎం అధ్యక్షుడు అన్వర్‌బాష తెలిపారు. ప్రజా చైతన్య యాత్ర పేరిట ఇటీవల అన్నీ గ్రామాల గిరిజనుల సమస్యలు గుర్తించామని, వాటిపై అధికారులు చర్యలు చేపట్టేలా ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆత్మకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్‌లో శనివారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వంతో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రజాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ ఎం. శ్రీనివాసులునాయుడు, టుబాకోబోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సీహెచ్. రమణయ్యనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కే.సుధాకరరెడ్డి, బీజేపీ నేత మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా మైదానం శుభ్రం

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈద్గా మైదానాన్ని శనివారం డ్రోజర్‌తో శుభ్రం చేశారు. ఈనెల 31న రంజాన్ కావడంతో ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహిస్తారు. సర్పంచి పావులూరి సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లా సిబ్బందితో మైదానంలో శుభ్రపరిచారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

సంగం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ, మండల ప్రత్యేకాధికారి రమేష్ నాయక్ కోరారు. శనివారం ఆయన స్థానిక సొసైటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగం మండలం దువ్వూరు సొసైటీ పరిధిలో నాలుగు, సంగం సొసైటీ పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తేమశాతం 17శాతం కంటే ఎక్కువ ఉన్నా ఒక్కొక్క శాతానికి క్వింటాకు కిలో చొప్పున తరుగు తీసుకుని పుట్టి రూ. 19,720లకు కొనుగోలు చేస్తామన్నారు. స్థానిక మిల్లర్లనే కాకుండా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల రైస్ మిల్లుర్లతో మాట్లాడి కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేశామన్నారు. సంగం సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రాలకు బాపట్ల రైస్ మిల్లర్ల ప్రతినిధులు వచ్చి ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమం తహసీల్దారు సోమ్లానాయక్, ఏవో శ్రీహరి, సీఈవో దస్తగిరి, వీఏఏలు, తదితరులు పాల్గొన్నారు.


ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రమేష్ నాయక్

వాల్వు గుంతపై మూత ఏర్పాటు

ఉదయగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న వాల్వు గుంతపై శనివారం పంచాయతీ అధికారులు మూత ఏర్పాటు చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'ప్రమాదకరంగా వాల్వు గుంత' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ ఈవో కరీముల్లా సిబ్బందితో వాల్వు గుంతపై మూత ఏర్పాటు చేయించారు.


వాల్వు గుంతపై ఏర్పాటు చేసిన మూత

ఉన్నతాధికారుల ఆరా

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం సచివాలయంలో వృథాగా పడి ఉన్న చెత్త బుట్టలకు సంబంధించి ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో 'నిరుపయోగంగా చెత్త బుట్టలు' అనే శీర్షికన కథనం ప్రచురితం అయింది. స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు శనివారం ఈ విషయమై ఆరా తీశారు. ఎంజాయిషీ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి హరిని ఆదేశించడంతో అందుకు గల కారణాలను ఆయన నివేదిక రూపంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో పంపిణీ చేపడతామని తెలిపారు.

నీటి గుంటల నిర్మాణంతో భూగర్భ జలాల పెంపు

ఉదయగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లో నీటికుంటలు ఏర్పాటు చేసుకోవడంతో భూగర్భజలాలు పెరుగుతాయని ఎంపీడీవో అప్పాజీ, ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని శకునాలపల్లి పొలాల్లో నీటికుంట నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటికుంట నిర్మాణాలు ఉపాధి హామీ పథకం నిధులతో చేపడతామన్నారు. ప్రతి రైతూ నీటికుంట ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో 360 నీటికుంటల తవ్వకం లక్ష్యం కాగా, 208 నీటికుంటలకు ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలోనే ఆమోదం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


నీటికుంట తవ్వకానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు

గరుడ వాహనం బహూకరణ


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గరుడ వాహన దాతలు

ఆత్మకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని తిరునాళ్ల తిప్పలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహ ఆలయానికి పట్టణానికి చెందిన చల్లా రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివకుమార్‌రెడ్డి దంపతులు పంచలోహ గరుడవాహనం బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను ఆశీర్వదించారు.

నేడు ట్రైసైకిళ్ల పంపిణీ

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆసరాగా నిలిచేందుకు వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అన్నీ నియోజకవర్గాల్లో చేపడుతున్న ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్ల పంపిణీ ఆదివారం ఆత్మకూరులో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొననున్నారు.ఈ క్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10గంటలకు గుంటూరుజిల్లా పెదకాకానిలోని శంకర కంటి వైద్య బృందం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చేబ్రోలు వసంతరావు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణం

వింజమూరు,(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గంగమిట్ట, సబ్ రిజిస్టర్ కార్యాలయం, బాలుర వసతి గృహం రోడ్డును రూ.5లక్షల పంచాయతీ నిధులతో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచి నల్లగొండ సృజన శనివారం తెలిపారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణం చేస్తున్నామని ఆమె తెలిపారు.

'ఉపాధి' పనులపై సమీక్ష


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్

సీతారామపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో భాస్కర్ మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు.కూలీల హాజరు, ఆన్లైన్ నమోదుతోపాటు పలు అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎపీవో సుభాషిణి, ఈసీ సువార్తయ్య, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

ఆత్మకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహణకు శ్రీకారం చుట్టిందని తహసీల్దార్ వవీ సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు ఉదయం 10 గంటలలోపు హాజరుకావాలని కోరారు.

దంత సంరక్షణపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి అనీస్‌సల్మా

ఉదయగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ దంత ఆరోగ్య దినోత్సవం సందర్భంగా దంత వైద్యాధికారిణి అనీస్‌సల్మా రోగులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ దంత సంరక్షణ విషయంలో ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సింధూర, నిష్రాహీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవనాల ప్రారంభోత్సవం ఎప్పటికో!?

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమనిచిరువెళ్లలో ఏడాది క్రితం నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుతున్నాయి. సచివాలయంతో పాటు, హెల్త్‌సెంటర్ భవన నిర్మాణాలు పూర్తి చేశారు. అందులోకి కార్యాలయాలు మార్చేలా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అవి మందుబాబులకు ఆవాసాలుగా మారాయి. ఇప్పటికైనా వీటిని ప్రారంభించాలి.


అనంతసాగరం మండల కేంద్రంలో ప్రారంభానికి నోచని హెల్త్ సెంటర్

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏఎస్ పేట,మార్చి22(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో ఆరో తరగతి,ఇంటర్‌లో ప్రవేశానికి ఏప్రిల్ 11 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథ, బడి మానేసిన, ఎస్సీఎస్టీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు ఇందులో ప్రవేశానికి అర్హులని తెలిపారు.ఆధార్, ఫొటో,కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు,తల్లిదండ్రుల ఆధార్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

● సీతారామపురం, (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని కేజీబీవీలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని శనివారం ప్రిన్సిపాల్ షేక్ షాజిదా ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీలో 40 సీట్లు, ఆరో తరగతికి 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులకు అవకాశం ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● **గురుకులంలో ప్రవేశానికి...**

ఆత్మకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరులో నూతనంగా ప్రారంభించిన మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.రమ్యశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 సీట్లకుగాను ఏప్రిల్ 27న ప్రవేశపరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 96429 13572 నెంబరును సంప్రదించవచ్చని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు వెలుగొండ సాధన సమితి సమావేశం

ఉదయగిరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీ మంజిల్‌లో ఆదివారం వెలుగొండ సాధన సమితి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో సాగు, తాగునీటి కష్టాలే తీరాలంటే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయడంతోపాటు అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలను యుద్ధప్రాతిపదికన నిర్మించాలన్నారు. ఆదివారం సమావేశానికి తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, సాగునీటి రంగ నిపుణులు పాల్గొంటారని, రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, నాయకులు మాలకొండారెడ్డి, ఫడ్స్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శ్యాంప్రసాద్ తదితరులు

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ


నర్రవాడ వైద్యశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని నర్రవాడ పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మనోజ్ఞ, హరీష్‌లు గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

వేర్వేరు చోట్ల పట్టపగలే చోరీ

● **బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ**

వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో శనివారం పట్టపగలే రెండు చోట్ల చోరీ జరిగింది. బంగారం, వెండి వస్తువులతోపాటు నగదును దుండగులు దోచుకెళ్లారు. ఆ వివరాలు...

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని సమయంలో పట్టపగలే జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ నివాసంలో చోరీ జరిగింది.ఈ సంఘటన శనివారం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు, గ్రామానికి చెందిన భోగ్యం నాగభూషణం స్థానిక మద్యం దుకాణం సమీపంలో కూల్‌డ్రింక్స్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. రోజూ మాదిరిగా దుకాణానికి వెళ్లి తిరిగి మధ్యాహ్న సమయంలో ఇంటికి చేరుకున్న ఆయన గేటు తాళాలు పగులకొట్టి ఉండటాన్ని చూసి బెంబేలెత్తిపోయాడు. హడావుడిగా ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను పగులకొట్టిన దుండగులు దుస్తులను చిందర, వందరగా కిందపడేశారు. అందులోని పది తులాల వెండి, రూ. 10వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించి బోరున విలపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొన్న ఎస్ఐ రఘునాథ్ సమగ్రంగా పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


భోగ్యంవారిపల్లిలో బీరువాను పగులకొట్టి కింద పడేసిన దుస్తులు

● **దుత్తలూరులో 11 సవర్ల బంగారం...**


దుత్తలూరులో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లో శనివారం పట్టపగలే ఓ నివాసంలో చోరీ జరిగింది. వివరాల మేరకు.. భగవాన్ వెంకయ్యస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న చింతనబోయిన నరేష్ నివాసంలో మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి ముందు గేటు, ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అనంతరం బీరువా తాళాలు ధ్వంసం చేసి అందులోని 11 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. నరేష్ ఇంటికొచ్చి చూడగా గేటు, ప్రధాన ద్వారం తలుపు తాళాలు పగలగొట్టి ఉండడం, బీరువా వస్తువులను చెల్లాచెదరుగా పడేయడం చూసి చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంకు సమాచారం అందించడంతో వారొచ్చి వేలిముద్రలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు బైకును ఢీకొన్న కారు

● **ఒకరి మృతి, మరొకరికి గాయాలు**


క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై వెళ్తున్న మోటారు బైకును శనివారం వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు, పల్నాడు జిల్లా భీమవరం గ్రామానికి కృపారావు(35), జ్ఞానయ్య(42) ప్రకాశం జిల్లా టంగుటూరులో పొగాకు క్యూరింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిద్దరూ మర్రిపాడు మండలం పొంగూరులోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి మోటారు బైకుపై టంగుటూరుకి ప్రయాణమయ్యారు. ఆ సమయంలో దుత్తలూరు నుంచి లింగసముద్రం వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. దీంతో ఒకరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలవడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయగిరికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తీవ్రంగా గాయపడిన కృపారావును ఉదయగిరి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరుకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించాడు.

మోటారు బైకుల ఢీ : నలుగురికి గాయాలు


ఉదయగిరి వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఉదయగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న మోటార్ బైకులు ఒకదానికొకటి ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని గన్నేపల్లి సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. ఉదయగిరికి చెందిన చాంద్‌బాషా, కాలేషా, మస్తాన్ బైకుపై మండలంలోని కృష్ణంపల్లిలోని పొలం వద్దకు వెళుతున్నారు. ఈ సమయంలో వారి వెనుకనే అదే పట్టణానికి చెందిన మస్తాన్ బైకుపై వస్తూ గన్నేపల్లి గ్రామ సమీపంలో వారి బైకును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వారికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. వారు వచ్చి గాయపడిన వానిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తెలంగాణ పోలీసు కస్టడీకి మనీస్కాం నిందితుడు

కావలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరులో అనంతార్థ మనీస్కాం నిర్వాహకుడు సుభానీని ఈనెల 20వ తేదీన తెలంగాణ పోలీసులు కస్టడీకి తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మనీస్కాం కేసులో సుభానీని గత నెల 17వ తేదీన కావలి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించడంతో నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు. కాగా ఆయనపై తెలంగాణలోని మక్తల్ పోలీస్ స్టేషన్‌లో కూడా మనీస్కాం కేసులు నమోదై ఉన్నా పోలీసులకు దొరకకుండా మూడేళ్లుగా కావలిలో తలదాచుకున్నారు. ఎప్పుడైతే కావలిలో పోలీసులు అరెస్టు చేశారో గతంలో ఆయనపై మక్తల్‌లో కూడా కేసులు నమోదైనట్లు వెలుగు చూసింది. ఈ విషయం మక్తల్ పోలీసులకు తెలియడంతో వారు కోర్టులో పీటీ వారెంట్ వేసి నెల్లూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సుభానీని విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	104
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 425

కంప్యూటర్ ల్యాబ్ భవనం పనుల ప్రారంభం

లింగసముద్రం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం మంజూరు చేసిన కంప్యూటర్ ల్యాబ్ భవన నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఈ భవనానికి రూ.18.05 లక్షల మంజూరయ్యాయని సర్వ శిక్షాభియాన్ ఏఈ రామేంద్రరావు చెప్పారు. 2, 3 నెలల్లో పనులు పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. అలాగే ఇదే విద్యాలయంలో విద్యార్థినుల కోసం డార్మెట్రీ భవనం నిర్మాణ కోసం సర్వ శిక్షాభియాన్ కింద రూ.1.30 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులకు వారం రోజుల క్రితం టెండరు ప్రక్రియ జరిగిందని, ఈ నెలాఖరులో డార్మెట్రీ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.


కేజీబీవీలో చేస్తున్న కంప్యూటర్ ల్యాబ్ భవనం పనులు

న్యూస్ బాక్స్

మాలకొండ ఆదాయం రూ.7,03,980

వలేటవారిపాలెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.7,03,980 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. అష్టోత్తరం టికెట్లకు రూ.7,950, కుంకుమార్చనకు రూ.17,520, తలనీలాలకు రూ.28,575, వాహనపూజలకు రూ.2500, ప్రత్యేక దర్శనానికి రూ.1,78,600, స్థలపురాణం పుస్తకాల విక్రయానికి రూ.660, రూము అద్దెలు రూ.33,280, కవర్లకు రూ.5,700, లడ్డుప్రసాదానికి రూ.1, 64,730, అన్నదానంకు రూ.1,59,349, విరాళాలు రూ.1,05,116 ఆదాయం వచ్చిందని తెలిపారు.

సేవ్ వాటర్-సేవ్ లైఫ్

కలిగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అయ్యపరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం సేవ్ వాటర్-సేవ్ లైఫ్ అంటూ ప్రకృతి వనరుల ద్వారా లభించే నీరు యొక్క ఉపయోగాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కందుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు గాదిరెడ్డి మురళీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త సుంకర మాధవి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

కలిగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జమాతే ఇస్లామి హింద్ కలిగిరి శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు షేక్ ఖాజా అహమద్ రంజాను పండుగను పురస్కరించుకుని కుల మతాలకు అతీతంగా పలువురు నిరుపేద ముస్లిం, హిందువులకు శనివారం రంజాన్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షేక్ నాయబ్ రసూల్, కార్యకర్తలు షేక్ మీరావలి, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

కూరగాయలు, పోషక విలువలపై అవగాహన

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కూరగాయలు, వాటిలోని పోషక విలువలపై అవగాహన కల్పిస్తూ కూరగాయల ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జీ.బాలభాస్కరరావు, బి.నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కరేడుకు నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించండి

ఉలవపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు గ్రామానికి కందుకూరు నుంచి నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం గ్రామస్థులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కోరారు. ఈ మేరకు కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. 30 ఏళ్ల నుంచి ఉన్న నైట్ హాల్ట్ బస్సును. గత ఏడాది నుంచి తొలగించారని చెప్పారు. దీంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచు కె సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ప్రతిభను వెలికి తీయవచ్చు

బిట్రగుంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యతో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని టెక్నో పల్స్ కన్వీనర్ దిలీప్‌కుమార్ అన్నారు. బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో టెక్నోపల్స్ 2కె25 పేరుతో జాతీయస్థాయిలో సాంకేతిక విద్యపై ఒకరోజు సింపోసియం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ సింపోసియంకు జాతీయస్థాయిలో దాదాపు 1000 పేపర్ల వరకు రాగా వాటిలో మెరిట్ పేపర్లు 200 ఎంపిక చేశామన్నారు. అందులో బ్రాంచ్ వైజ్ 1 సెలెక్ట్ చేసి వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

కొండాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల నిర్మాణం ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. స్థానిక గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో శనివారం ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 90 మంది లబ్ధిదారులు మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారని, అవి ఏదశలో ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీబాషా, హౌసింగ్ ఏఈ సల్మాన్ పాల్గొన్నారు.

పేదరికంలేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

కొండాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని గుడవళ్లూర సర్పంచు బద్దిపూడి మాచర్ల అన్నారు. స్థానిక సచివాలయంలో శనివారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణ, కార్యదర్శి ప్రదీప్, ఉపసర్పంచు వి.మణికుమార్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేరే కారణమా..

మామూళ్ల కోసమా..?

- భవన నిర్మాణాలకు నెల రోజులుగా ఆగిన అనుమతులు
- నిబంధనలు బూచిగా చూపుతున్న అధికారులు
- ఇదంతా లంచాల పెంపునకే అంటున్న భవననిర్మాణదారులు


మున్సిపల్ కార్యాలయం

కావలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో భవన నిర్మాణాలకు మున్సిపల్ కార్యాలయంలో నెల రోజులుగా అనుమతులు ఇవ్వడం లేదు. అదేమని అధికారులను ప్రశ్నిస్తే కొత్త సాఫ్ట్‌వేర్‌లో సమస్య అని చెబుతున్నారు. అయితే నిజంగా సాఫ్ట్‌వేరే కారణమా..? లేక మామూళ్ల పెంచుకోడానికా అన్న అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. గతంలో అక్రమ లేఅవుట్లు, ఆక్రమిత ప్రభుత్వ స్థలాల్లో పెద్దపెద్ద భవనాల నిర్మాణానికే అనుమతులిచ్చిన అధికారులు ఇప్పుడు సొంత స్థలాల్లో నిర్మాణాలకు ఎందుకు అనుమతులు ఇవ్వడంలేదనేది కావలిలో పెద్ద చర్చనీయాంశమైంది. ప్రధానంగా మున్సిపల్ నియమ నిబంధనలను పాటించాలంటే కావలిలో ఏ ఒక్క భవనానికి కూడా అనుమతులు రావు. చివరకు అపార్ట్‌మెంట్లు కూడా నిబంధనలను అతిక్రమించి కడుతున్నా పట్టించుకునే అధికారే లేడు. నిబంధనలు ఎంత అతిక్రమిస్తే అంత మొత్తంలో మామూళ్ల పెరగటం తప్ప రోడ్ల మీదకు వచ్చి కడుతున్నా అడగే వారు లేరు. ప్లాన్ అప్రూవల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు చూపించే డిజైన్‌కు వాస్తవంగా నిర్మించే డిజైన్‌కు పొంతన ఉండదు. అలాంటప్పుడు అనుమతులు పొందిన భవనంలో నిర్మాణాలు చేపట్టాలంటే అధికారులు చేతులు తడపితే అంతా గప్‌చుప్ అయిపోతోంది. మరీ దుకాణాల నిర్మాణంలో నిబంధనలను భవన నిర్మాణదారులు పూర్తిగా తుంగలో తొక్కుతున్నా అధికారులు మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారు తప్ప ఏ కొంచం కూడా పాటించటంలేదనేది జగమెరిగిన సత్యం. ఇది గత కొంత కాలంగా జరుగుతున్న తంతు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా నిర్మాణాలలో నిబంధనలు మాత్రం అమలు కావటంలేదు.

● నిబంధనల బూచిగా చూపి..

పట్టణంలో అక్రమ లేఅవుట్లలో ఇటీవల భవన నిర్మాణాలకు పూర్తిగా అనుమతులు ఆపేశారు. అయితే భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటే అక్కడ రోడ్డు 30 అడుగుల వెడల్పు ఉండాలనే ప్రభుత్వ నిబంధన ఎప్పటి నుంచో ఉంది. అయితే దానిని బూచిగా చూపి అధిక మొత్తంలో మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల మున్సిపల్ అధికారులు భవన నిర్మానాలకు అనుమతులు ఇవ్వాలంటే 30 అడుగుల రోడ్డుకు ఎంత తక్కువ ఉంటే తగ్గిన రోడ్డులో సగం మున్సిపాల్టీకి సొంత ఖర్చులతో తమ సొంత స్థలం రిజిస్టర్ చేయాలని చెపుతున్నారు. ఉదాహరణకు 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉంటే 30 అడుగులకు 10 అడుగులు తగ్గుతున్నందున రోడ్డుకు ఇరువైపుల ఐదు అడుగులు వంతున సొంత స్థలాన్ని మున్సిపాల్టీకి వదలడటమే కాక దానిని రిజిస్టర్ చేయాలని చెబుతున్నారు. గతంలో రోడ్డు వదిలినట్లు ప్లానింగ్‌లో చూపిస్తున్నారు కానీ వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే తాజాగా రోడ్డు వదలటమే కాక మున్సిపాల్టీకి రిజిస్టర్ చేయాలని చెపుతుండడంతో దానికి భవన నిర్మాణదారులు ముందుకు రావడంలేదు. అధికారులు చెపుతుంటారులూ.. ఎక్కడా అమలు చేయరు.. కొంత కాలం ఆగితే వారే సర్దుకుపోతారులే అనే భావంతో ఉంటున్నారు. అయితే మున్సిపాల్టీకి భవన నిర్మాణాల అనుమతులకు డిజైన్ రూపొందించే లైసెన్స్‌డ్ ఇంజనీర్లు భవన నిర్మాణదారులకు మున్సిపల్ అధికారులకు మధ్య ఏజంట్లుగా వ్యవహరిస్తుంటారు. ఇచ్చి పుచ్చుకునేదంతా వారే చూసుకుంటారు. అయితే ప్రస్తుతం లైసెన్స్‌డ్ ఇంజనీర్లే కొంత కాలం ప్లాన్‌లు పెట్టకుండా ఉంటే అధికారులే దిగొస్తారులే అని భవన నిర్మాణదారులకు చెబుతుండడంతో ప్లాన్ అప్రూవల్‌కు పెద్దగా దరఖాస్తులు రావడం లేదనే ప్రచారం ఉంది. ఇదిలాఉంటే 30 అడుగుల బూచి చూపించి మామూళ్ల పెంచాలనే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ అధికారులు మాత్రం కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చిందని, అది ప్రాసెస్‌లో ఉండడం వలన ప్లాన్ అప్రూవల్స్ తీసుకోవడంలేదని, త్వరలో ఆ సమస్య తొలగిపోతుందని చెపుతున్నారు. కానీ వాస్తవంలో రోడ్డు తగ్గిన చోట స్థలం రిజిస్టర్ చేయించుకుంటారా లేక దానిని బూచి చూపి మామూళ్ల మొత్తం పెంచి అనుమతులు ఇస్తారా అనేది కావలిలో పెద్ద చర్చనీయాంశంగా ఉంది.

కొత్త సాఫ్ట్‌వేర్ వల్లే సమస్య

ప్రస్తుతం ప్లాన్ అప్రూల్ ఆగి పోవడానికి కారణం కొత్త సాఫ్ట్‌వేర్. ఇది ప్రాసెస్‌లో ఉంది. అది వీలు కానప్పుడు పాత సాఫ్ట్‌వేర్‌నే పునరుద్ధరిస్తారేమో చూడాలి. స్లమ్ ఏరియాలలో తప్ప మిగిలిన చోట ప్లాన్ అప్రూల్‌కు 30 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాలి.

- వివేకానంద్,
పట్టణ ప్రణాళికాధికారి, కావలి

నీటిని సంరక్షించుకోకుంటే మానవ మనుగడకే ముప్పు


మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు, పక్కన సిబ్బంది

కావలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పంచభూతాలలో ఒకటిగా భావించే నీటిని సంరక్షించుకోక పోతే మానవుల మనుగడకే ముప్పు ఏర్పడుతోందని ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు తెలిపారు. కావలి ఆర్టీసీ డిపో గ్యారేజిలో శనివారం ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నీటిని పొదుపుగా వాడుకోవటం అలవాటు చేసుకోవాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి వెళ్లేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ గ్యారేజిలో తక్కువ నీటితో బస్సులను శుభ్రపరచాలని, కుళాయిలను సకాలంలో కట్టివేయాలని, పైపులలో లీకేజీలను గమనించిన అరికట్టే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు కల్పనా రెడ్డి, గ్యారేజి ఇన్‌చార్జి ఎస్‌కే ఖాదర్ మొహిద్దీన్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఎం.రామక్రిష్ణ, స్టోర్ సూపర్‌వైజర్ ఎం. వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ అధికారి కేకే రావు, ఏడీసీ రవిప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్, ఏఐ ప్రాముఖ్యతపై దిశానిర్దేశం

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సివిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ల ప్రాముఖ్యతను విద్యార్థులు గుర్తించి ఆదిశగా తమ భవిష్యత్తు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే ఉన్నతస్థితికి చేరుతారని ఢిల్లీ దూరదర్శన్‌లో అదనపు డైరెక్టర్ జనరల్‌గా సేవలందించిన డాక్టరు ఆర్.అనంతపద్మనాభరావు సూచించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సమావేశమైన ఆయన సివిల్స్‌కు సన్నద్ధం కావడంలో పాటించాల్సిన మెలకువలు, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వివిధరంగాలలో ఉన్న ఉపాధి అవకాశాలను పొందేందుకు ఏయే గ్రంథాలను అధ్యయనం చేస్తే మెరుగైన ఫలితాలు దక్కుతాయో వివరించారు. పద్మనాభరావు కుమారుడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు జనార్దన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎలా ఉపయోగించుకోవాలి, ఏఐతో తమ జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని ఎలా పెంపొందించుకోవచ్చునో వివరించటంతో పాటు ప్రపంచంలో జరుగుతున్న నూతన పరిశోధనలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పద్మనాభరావును ఘనంగా సత్కరించారు.

● ఆధునిక సాంకేతిక యుగంలో ఇంజనీరింగ్ విద్యార్థులు సివిల్స్‌కు సిద్ధమైతే సమజానికి అత్యంత విలువైన పాలకులుగా మారవచ్చునని డాక్టరు ఆర్.అనంతపద్మనాభరావు సూచించారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, కళాశాల ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ మీరాషరీఫ్, అత్తంటి మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థినికి ఆత్మరక్షణ అవసరం


శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఉమాశంకర్

కలిగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థినికి ఆత్మ రక్షణ అవసరమని ఇందు కోసం ప్రత్యేక శిక్షణతో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు. శనివారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలోని విద్యార్థినులకు ఈ విషయమై ట్రైనర్ బోరెడ్డి సరిత ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కేతు సుప్రియ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

చుండి హైస్కూల్‌లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్ ప్రారంభం


చుండి మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

వలేటివారిపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లో శనివారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలపై చర్చ


తహసీల్దారుతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

బిట్రగుంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్ పరిధిలోని ఎల్సీగేట్ 144, 143 ప్రాంతాల్లో ఫుట్ ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలపై రైల్వే అధికారులు శనివారం తహసీల్దారు సురేష్‌బాబుతో చర్చించారు. బోగోలు మండల పరిధిలోని రైల్వే భూముల సర్వే నెంబర్లు, ప్రభుత్వ, ప్రైవేటు భూముల సర్వే నెంబర్ల వివరాలను స్థానిక రైల్వే ఐవోడబ్ల్యూ రాజేష్ తహసీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, మండల సర్వేరు శ్రీనివాసులు, రైల్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ఉల్లాస్ పరీక్షలు


అంగన్‌వాడీలకు పరీక్ష పత్రాలు, పెన్నులు అందచేస్తున్న ఏపీఎం

కొండాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు నిర్వహిస్తున్న ఉల్లాస్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఏపీఎం కాంతారావు తెలిపారు. పరీక్షల విధానంపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాలు, పెన్నులు అందజేశారు. మండలంలో 505 మంది మహిళలు పరీక్షలు రాయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఎంఈవో ఆనందరావు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

మోటారు బైక్ ఢీకొని మున్సిపల్ ఉద్యోగికి గాయాలు


గాయపడిన రసూల్

కావలి రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మోటారు బైక్ ఢీకొని మున్సిపల్ ఉద్యోగి రసూల్‌కి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. శనివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో రసూల్ నడుచుకుంటూ రోడ్డు దాటే క్రమంలో వెనుక వైపున వస్తున్న మోటారు బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించారు.

తీర ప్రాంతాల పరిరక్షణపై అవగాహన

● షార్ కమాండెంట్ సంజిత్‌కుమార్ ● కావలికి చేరిన సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు

కావలి రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల పరిరక్షణ ధ్యేయంగా తీర ప్రాంతాల పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శ్రీహరికోట స్పేస్ సెంటర్ కమాండెంట్ సంజిత్‌కుమార్ పేర్కొన్నారు. కోల్‌కత్తా నుంచి కన్యాకుమారి వరకు తీరప్రాంతాల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సీఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీ శనివారం సాయంత్రం కావలికి చేరింది. వీరికి స్థానిక పోలీసులు పట్టణంలోని ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కల్యాణ మండపంలో రాత్రి బస ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఈ యాత్ర ఈనెల 31 వరకు కొనసాగుతుంద న్నారు. ఆదివారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు తీరప్రాంత భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని, అనంతరం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించం

● సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

అల్లూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అలాకాకుండా ఇబ్బందులు పెడితే సహించేది లేదని సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి హెచ్చరించారు. అల్లూరు ఏఎంసీ గోదాముల్లోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు తక్కువగా ఇస్తున్నారని తెలుసుకుని జిల్లా అధికారులతో మాట్లాడి గోనె సంచులు అధికంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలో 40 వేల పుట్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, ఆ రైతుల ఖాతాల్లోకి 24 గంటలలోపు రూ.79 కోట్లు జమ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, మేడా కృష్ణారెడ్డి, మేడా రమణారెడ్డి, రాధయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు న్యాయం చేయండి

● కలెక్టర్ ఆనంద్‌కు ఏపీ ఎరుకుల సేవా సంఘం నేతల వినతి


జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేస్తున్న గిరిజన నేతలు

బిట్రగుంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో వడ్డెర (బీసీ-ఏ) కులానికి చెందిన కొందరు ఎస్టీలుగా నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విద్య, ఉద్యోగాలలో లబ్ధిపొందుతున్నారని, వారిపై చర్యలు చేపట్టి అసలైన ఎస్టీలకు న్యాయం చేయాలని ఏపీ ఎరుకుల సేవా సంఘం నేతలు కోరారు. ఈ మేరకు శనివారం నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎరుకుల సేవా సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ, రాష్ట్ర గిరిజన నాయకులు నల్లబోతుల మోహన్‌కుమార్ ధర్మా, మండల అధ్యక్షుడు బోగిరి యోహాన్, ఎరుకుల సంఘ నాయుకులు నల్గొండ పోలయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల ఉద్యోగుల సంఘం నిరసన


నిరసన కార్యక్రమంలో మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘం నేతలు

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాగానికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రప్రభుత్వం పూనుకుంటున్నదని, సుప్రీం కోర్టు తీర్పు అసంబద్ధమని మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘం నేతలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో తీర్మానించటం న్యాయం కాదని, ఎస్సీలపై నిజంగా ప్రేమ ఉంటే బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘాల నేతలు లింగాబత్తిన బ్రహ్మయ్య, పాలేటి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పీజీఆర్ఎస్‌ను వినియోగించుకోండి

కొండాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దారు ఎమ్.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వండి

లింగసముద్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆటల పోటీలు స్నేహానికి దోహదం


వాలీబాల్ ఆడుతున్న యువకులు

ఉలవపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : ఆటల పోటీలు స్నేహానికి దోహదపడతాయని రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ సీఐ జీ.శివన్నారాయణ చెప్పారు. శనివారం మండలంలోని రామాయపట్నంలో సీఐ శివవన్నారాయణ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామాల భాగస్వామ్యంతో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పెదపట్టపుపాలెం సర్పంచు ఆవుల జయరాం ప్రారంభించారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమంలో కరేడు హైస్కూల్ పీఈటీ ఓగుబోయిన శ్రీను, కొండూరి ప్రదీప్, వాయల బాబులు, ఎస్సైలు మస్తాన్ షరీఫ్, పి ఈశ్వరయ్య, సర్పంచులు ఎ వెంకటేశ్వర్లు, సీహెచ్ రమణయ్య, గ్రామ పెద్దలు ఎ కృష్ణారావు, తూపిలి రవి, పెద కాపు వి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన తప్పనిసరి



కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


కలిగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి పేర్కొన్నారు. జాతీయ క్షయ నియంత్రణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సాయిలక్ష్మి, వింజమూరు టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ శివ, ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ షబ్బీర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

● కందుకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడులో క్షయవాధిపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎల్ఎస్ కే. శ్రీమన్నారాయణ, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, శ్రీదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

క్రసంఖ్య	పేరు	ఊరు	మండలం
1.	బత్తినేని వెంకటేశ్వర్లు	వేదాయపాళెం	నెల్లూరు
2.	ఎస్.ముత్తుకుమార్	పొదలకూరు రోడ్డు	నెల్లూరు
3.	కె.రాజగోపాల్	వేదాయపాళెం	నెల్లూరు
4.	కొండూరు శ్రీనివాసాచారి	దొడ్లసుబ్బారెడ్డినగర్	నెల్లూరు
5.	గండికోట సుధీర్‌కుమార్	శ్రీరామ్‌నగర్	బుచ్చి
6.	చెరువుపల్లి వెంకట ధీరజ్	యల్లాయపాళెం	కొడవలూరు
7.	నల్లా జయరామయ్య	బాలాజీనగర్	నెల్లూరు
8.	కె.సాయి వర్షిత	శ్రీనగర్ కాలనీ	నెల్లూరు
9.	కలిచేటి సుబ్బారెడ్డి	దూర్జటినగర్	గూడూరు
10.	కంచర్ల ప్రవల్లిక	శాంతినగర్	కావలి
11.	ఎస్.రాజేంద్రప్రసాద్	కొత్తూరు	ఇందుకూరుపేట
12.	బక్కముంతల దయాకర్	వాలాయనందపురం	గూడూరు
13.	మాదాల రామ్‌ప్రసాద్	కామాటివీధి	ఇందుకూరుపేట
14.	జి.నవనీతమ్మ	నెల్లూరు	నెల్లూరు
15.	చల్లాకొలను మల్లికార్జునరావు	బుచ్చిరెడ్డిపాళెం	బుచ్చిరెడ్డిపాళెం
16.	పొన్నూరు వెంకట నవదీప్	కోటంరెడ్డివారివీధి	కావలి
17.	తోట వెంకటేశ్వర్లు	బాలాజినగర్	నెల్లూరు
18.	జి.రేవతి	కేపీహెచ్‌బీ కాలనీ	నెల్లూరు
19.	కాకర్ల వెంకటయ్య	రామ్మూర్తినగర్	నెల్లూరు
20.	ఆకుల పద్మావతి	పోలీసు కాలనీ	నెల్లూరు
21.	సిహెచ్.సురేష్	వేదాయపాళెం	నెల్లూరు
22.	డి.ఆదిత్య అభిరామ్	అనంతవరం	దగదర్తి
23.	బొల్లినేని వెంకట రవికుమార్	జగదేవిపేట	ఇందుకూరుపేట
24.	పుచ్చలపల్లి జీవన్‌కుమార్‌రెడ్డి	పెనుబర్తి	నెల్లూరు రూరల్
25.	సోమిశెట్టి సుబ్బారావు	ములుమూడి బస్టాండ్	నెల్లూరు
26.	కొమ్మి మస్తానయ్య	సండే గాంధీనగర్	నెల్లూరు
27.	బి.శ్రీదర్శిణి	కొండాయపాళెం	నెల్లూరు
28.	శాఖవరపు వేణుగోపాల్	బుజబుజనెల్లూరు	నెల్లూరు
29.	వావింటపర్తి అనిల్‌కుమార్	నెల్లూరు	నెల్లూరు
30.	పప్పు దిలీప్‌కుమార్	బీవీ.నగర్	నెల్లూరు
31.	వి.జానకిరామయ్య	కస్తూర్తిదేవి నగర్	నెల్లూరు
32.	కోట వెంకట కరుణాకర్‌రెడ్డి	సంగం	సంగం
33.	కె.వెంకట లాస్యప్రియ	రంగనాయకులపేట	నెల్లూరు
34.	కందుకూరు జయమ్మ	ఏసీనగర్	నెల్లూరు
35.	మలిశెట్టి ఈశ్వరయ్య	హరనాథపురం	నెల్లూరు
36.	కటమూడి నరసింహం	నవాబుపేట	నెల్లూరు
37.	పి.కామేశ్వరి	జలదంకి	జలదంకి
38.	జి. శ్రీనివాస హేమంత్	కావలి	కావలి
39.	పి.వెంకటేశ్వర్లునాయుడు	బజారువీధి	నాయుడుపేట
40.	బొప్పిన రామకృష్ణ	వేదాయపాళెం	నెల్లూరు
41.	పల్లాపు శ్రావణి	జమ్మవరం	ఏఎస్‌పేట
42.	యల్.డి.ఆర్.గోపాల్‌రెడ్డి	విక్రమ్‌నగర్	నెల్లూరు
43.	పుల్లా కుమార్	బుచ్చిరెడ్డిపాళెం	బుచ్చిరెడ్డిపాళెం
44.	యస్.కె.అబ్దుల్ అలీమ్	నమాజ్‌కట్ట	గూడూరు
45.	వి.సత్యనారాయణ	సరస్వతినగర్	దర్గామిట్ట
46.	సిఎస్.శారీస్	ఉండిగంవారి వీధి	కావలి
47.	ఎమ్.వెంకటరామిరెడ్డి	పడుగుపాడు	కోవూరు
48.	పార్థసారథి	ప్రశాంతినగర్	నెల్లూరు
49.	పోట్లూరు నందకిషోర్	ముత్తుకూరు	విడవలూరు
50.	పొట్టాపు శ్రీతులసి	మూలాపేట	నెల్లూరు
51.	ఏ.అరుణ్‌కుమార్	బాలాజీనగర్	నెల్లూరు
52.	కె.దశరథరామయ్య	గూడూరు	గూడూరు
53.	పి.వెంకటరమణయ్య	పోలీస్‌కాలనీ	నెల్లూరు
54.	కంకణాల చైతన్య దుర్గా	కొత్తబజార్	కావలి
55.	డి.హేమంత్‌కుమార్	పాటూరు వారివీధి	ఇందుకూరుపేట
56.	కె.రామ్మూర్తి	లేక్వ్యూకాలనీ	నెల్లూరు
57.	ఉచ్చూరు శ్రీనివాసులు	లక్ష్మీపురం	నెల్లూరు
58.	టి.పద్మావతి	పప్పులవీధి	నెల్లూరు
59.	దువ్వూరు లక్ష్మి	పూసలవారి వీధి	కావలి
60.	కలవకూరి బాలచెన్నయ్య	వాయినందన ప్రెస్‌వీధి	కావలి
61.	సున్నా పెంచలయ్య	తూకుమానిమిట్ట	నెల్లూరు
62.	ఉరటూరు మాల్యాద్రి	సంతపేట	నెల్లూరు
63.	ఆర్‌ఎస్‌ఎస్ భరద్వాజ్	బుజబుజనెల్లూరు	నెల్లూరు
64.	కె.జయమ్మ	జలదంకి	జలదంకి
65.	పి.శ్రీనివాసకుమార్	ఉస్మాన్‌సాహెబ్‌పేట	నెల్లూరు
66.	వడ్లమూడి సుప్రియ	వెంగమాంబ వీధి	నెల్లూరు
67.	పవన్‌కుమార్	వేదాయపాళెం	నెల్లూరు
68.	పి.ప్రమీల	చంద్రమౌళినగర్	నెల్లూరు
69.	వై.స్వప్న	కొత్తపాలెం	వాకాడు
70.	ఆర్.రామసుబ్బమ్మ	బుజబుజనెల్లూరు	నెల్లూరు
71.	బుట్టి బాలాజీ	కొత్తమినగల్లు	బుచ్చిరెడ్డిపాళెం
72.	అమరనాథ్	కావలి	కావలి
73.	వై.రామ్మోహన్‌రావు	బి.వి.నగర్	నెల్లూరు
74.	ఎమ్.రామలక్ష్మి	గూడూరు	గూడూరు
75.	చల్లాకొలును శివతేజ	బుచ్చి	బుచ్చి
76.	కట్టా సుబ్రమణ్యం	సర్వేపల్లి	వెంకటాచలం
77.	ఆర్.సీతారామలక్ష్మి	నెల్లూరు	నెల్లూరు
78.	యస్.కె.షరీన్	నమాజ్‌కట్ట	గూడూరు
79.	వి.సాయిలక్ష్మి	నారాయణ ట్రైనింగ్ సెంటర్	నెల్లూరు
80.	ఎస్‌కే.జిలానీ బాషా	మెట్టు	చిట్టమూరు
81.	అవ్వారు లక్ష్మి	అరుణాచలం వీధి	లక్ష్మీపురం
82.	పరుచూరు వెంకటేశ్వర్లు	చంద్రమౌళినగర్	నెల్లూరు
83.	ఎన్.కుమార్	ఏ.కె.నగర్	నెల్లూరు
84.	వి.శ్రీనివాసులు	పొదలకూరు రోడ్డు	నెల్లూరు
85.	కె.నిత్య	చంద్రమౌళినగర్	నెల్లూరు
86.	కొండ్లపూడి చంద్రారెడ్డి	ఆకిలి వలస	రాపూరు
87.	షేక్ మస్తాన్	బిట్రగుంట	బోగోలు
88.	టి.శ్రీలక్ష్మి	ఎ.పి.హౌసింగ్‌బోర్డు	నెల్లూరు
89.	కొత్తూరు కామాక్షి	కెపిహెచ్‌బీ కాలనీ	నెల్లూరు
90.	బాణాల గౌతమ్	చముదుగుంట	వెంకటాచలం
91.	ఎన్.మనోహర్	బలిజపాళెం	నెల్లూరు
92.	బి.నవీన్	దగదర్తి	దగదర్తి
93.	వైష్ణవి	రైల్వేస్టేషన్ రోడ్	కావలి
94.	యస్.బలరామ్‌రెడ్డి	వేదాయపాళెం	నెల్లూరు
95.	జి.జయప్రసాద్	కేపీహెచ్‌బీ కాలనీ	నెల్లూరు
96.	డి.సంధ్యారాణి	కెపిహెచ్‌బీ కాలనీ	నెల్లూరు
97.	కె.శివరాం	పొదలకూరు రోడ్డు	నెల్లూరు
98.	పి.రాకేష్	మర్రిపాడు	సంగం
99.	పి.రాధ	నాయుడుపేట	నాయుడుపేట
100.	కె.అనూష	శ్రీకొలను	ఏఎస్‌పేట

యథార్థ వార్తలకు ప్రతీక ఆంధ్రజ్యోతి-ఏబీఎన్

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- వార్తలే కాదు బహుమతులూ ఇవ్వడం శుభపరిణామం
- 'శుభమస్తు' అధినేత బయ్యా రవి
- 'ఆంధ్రజ్యోతి కార్ అండ్ రేస్' విజేతల ప్రకటన



మొదటి విజేత కూపన్‌ను చూపుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పక్కన 'శుభమస్తు' అధినేత బయ్యా రవి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉన్నది ఉన్నట్లు నిష్పక్షపాతంగా ప్రజలకు వార్తలు అంది స్తూ ప్రజలు, పాఠకుల మన్ననలు పొందిన పత్రిక ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చానల్ అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కితాబిచ్చారు. శనివారం సాయంత్రం నెల్లూరు నగరం లోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో జరిగిన 'ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్' లక్కీ డ్రా కార్యా క్రమంలో ప్రశాంతిరెడ్డి పాల్గొని మాట్లాడారు. యథార్థ వార్తలకు ప్రతీకేగాక పాఠకులకు 22వ వార్షికోత్సవం కానుకగా రూ.కోటి విలువ కలిగిన బహుమతులు అందించడం అభినందనీయం అన్నారు. లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేసే అవ కాశం కల్పించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధా కృష్ణకు, ఆంధ్రజ్యోతి సిబ్బందికి ధన్యవాదాలు తెలి పారు. మరెన్నో మంచి వార్తలు అందిస్తూ ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమె ఆకాం క్షించారు. అనంతరం మరో అతిథి శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవి మాట్లా డుతూ అక్షరమే ఆయుధం అనే నినాదంతో అడుగుపెట్టిన ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి పాఠకుల ఆదరాభి మానాలు పొందిందన్నారు. తీసుకోవ డమే కాదు ఇవ్వడం కూడా మాకు తెలుసంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యాజమాన్యం గత 22 సంవత్సరాలుగా పాఠకులకు పట్టాభిషేకం పేరుతో బహుమతులు ఇవ్వడం పత్రికా ప్రపంచంలో మరే పత్రిక, ఛానల్ చేయడం లేద న్నారు. పత్రిక నడపడం అంటే ఎన్నో ఒడిదుడు కులు ఉంటాయని, అన్ని సవాళ్లను ఎదుర్కొని వార్తా ప్రపంచంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అగ్రభాగాన నిలిచిందని అన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని వేలాదిమంది పాఠకుల నుంచి వచ్చిన కూపన్లలో మొదటి విజేతను ఎమ్మెల్యే ప్రశాంతి, రెండో విజేతను బయ్యా రవి, మూడో విజేతను ఆంధ్రజ్యోతి ఏజెంట్ సత్యనారాయణ ప్రకటించారు. మొదటి విజేత నెల్లూరు రూరల్ మండలం కొత్తూరులోని శ్రామిక్ నగర్‌కు చెందిన ఎస్‌కే.మస్తాన్‌బీకి ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ చేసి అభినం దించారు.



విజేతల కూపన్లను చూపుతున్న ఆంధ్రజ్యోతి ఏజెంట్లు

అనంతరం పాఠకులు, ఏజెంట్లు తదితరులు వంది మంది కన్సొలేషన్ విజేతలను కూపన్ల ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్య క్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు బీఎం కే.హరికృష్ణ, ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ, సర్క్యులేషన్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, ఏడీవీటీ ఇన్‌చార్జ్ అబ్దుల్ రహీం, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి నాగరాజు, ఏబీఎన్ స్టాఫ్‌రిపోర్టర్ కె.మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

డీలర్ల సమావేశంలో డీఎస్‌వో అంకయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వో అంకయ్య

నెల్లూరు (హరనాథపురం), మార్చి 22 (ఆంధ్ర జ్యోతి) : రేషన్ కార్డుదా రులు ఈకేవైసీ చేయించు కోవాలని డీఎస్‌వో అంకయ్య కోరారు. శనివారం ఆయన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిం చారు. కార్డుదారులు ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందు తాయని చెప్పారు. రేషన్‌కార్డు లోని సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ విషయంలో డీలర్లు కార్డుదారులందరికీ అవగాహన కల్పించా లని సూచించారు. ఈ సమావేశంలో చౌక దుకాణాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రమేష్, ఉపాధ్య క్షుడు వీ వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడిస్తారు?

కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజలు ఎదురుచూస్తు న్నారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రక్రియ మొదలు పెడుతుందా?, ఎప్పుడు దరఖాస్తు చేసుకుం దామా? అని నిరీక్షిస్తు న్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంకా ప్రక్రియ ప్రారంభం కాకపోవ డంతో నిరాశ చెందుతున్నారు. తొలుత ఈ ఏడా ది సంక్రాంతికి కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయడానికి నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఆ తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు.



రేషన్‌షాపులో సరుకులు పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

నెల్లూరు (హరనాథపురం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడేళ్ల నుంచి కొత్త రేషన్‌కార్డులు మంజూ రు కావడంలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రెండు సంవత్సరాలు రేషన్ కా ర్డుల పేరిట బియ్యం కార్డు లు మంజూరు చేసిం ది. తరువాత మూడేళ్ల ఒక్క కార్డు కూడా ఇవ్వలేదు. వైసీపీ హయాంలో దరఖాస్తు చేసు కున్న చాలా మం ది అర్హులకు కార్డులు రాలేదు. ఆ పార్టీ మద్దతుదారులకు అధికంగా కార్డులు జారీ చేసినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అర్హులు అందరికీ కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ప్రకటిం చింది. మొన్న సంక్రాంతికి కార్డులు ఇస్తామని పేర్కొంది. జిల్లా పౌరసరఫరాల అధికారులు కూడా కొత్త కార్డులు ఇస్తా మని గత డిసెంబర్‌లో ప్రకటించారు. డిసెంబరు 2వతేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపడ తామని, కొత్త రేషన్‌కార్డులే కాదు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కానీ ఆ తర్వాత పురోగతి లేకుండా పోయింది.


ప్రభుత్వ పథకాలకు అదే ప్రామాణికం

ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసు కుంటుండటంతో కొత్త కార్డులు కావాలని కోరుతూ జిల్లా, మండల స్థాయి లో నిర్వహించే ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో ప్రజలు పెద్ద ఎత్తున అర్జీ లు సమర్పిస్తున్నారు. మూడేళ్ల నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవ కాశాలు లేకపోవడంతో ఇప్పుడు అందు కోసం అనేక మంది అటు తహసీల్దార్ కార్యాలయాలు, ఇటు పౌర సరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతు న్నారు. కుటుంబంలో ఒకరు చని పోయి ఉంటే వారి తొలగింపు, పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుం బంలో ఐదారు మంది గతం లో కలిసి ఉండి ఇప్పుడు విడిపోయి ఉంటే ఇటువంటి వారు కొత్త కార్డుల కోసం కార్యా యాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్‌కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీలు విషయా న్ని జిల్లా అధికారులు ప్రస్తావిం చినట్లు తెలిసింది. ఈ విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, త్వరలోనే ప్రకటన వస్తుందని ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలిసింది.

రేషనలైజేషన్ ప్రక్రియ..

జిల్లాలో ప్రస్తుతం 7.38 లక్షల కార్డులున్నాయి. 1513 రేషన్‌షాపులు న్నాయి. 438 ఎండీవో వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుల రేషనలైజేషన్ ప్రక్రియ గతంలోనే పూర్తయింది. 800కు మించి కార్డులున్న రేషన్‌షాపులను అధికారులు గుర్తించారు. కొత్త రేషన్‌షాపుల ఏర్పాటుకు కార్డుల విభజన ప్రక్రియ కూడా చేశారు. నిరుద్యోగ యువతకు కొత్త రేషన్ షాపుల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలనుకు న్నారు. గ్రామాల్లో ఒక్కో చౌక దుకాణానికి 400 నుంచి 450 కార్డులు ఉండాలని, మున్సిపాలిటీల్లో 500 నుంచి 550 కార్డులు ఉండాలని, కార్పొరేషన్ పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలని అధికారులు నిర్ణయించి, ఆ ప్రకరం రేషనలైజేషన్ పూర్తి చేశారు. అయితే షాపుల విభజన విషయంలో కొందరు డీలర్లు కోర్టును ఆశ్రయించారు. తమకు ఒక్కొక్కరికి 1000 రేషన్‌కార్డులు ఉంటేనే జీవనం సాగించగలమని తెలియ జేశారు. ఈ నేపథ్యంలో కొత్త కార్డుల జారీకి బ్రేక్ పడింది. అయితే కోర్టు వ్యవహారం ఇటీవల ముగిసింది. చనిపోయిన వారి కార్డులు తొలగించిన తర్వాత కార్డులు విభజన చేపట్టాలని న్యాయస్థానం సూచించినట్లు సమా చారం. ఈ క్రమంలో కొత్త కార్డుల జారీ మొదలయ్యే అవకాశం ఉంది.

దుకాణానికి 1000 కార్డులు ఉండేలా చూడాలి



జిల్లాలో రేషన్ షాపుల నిర్వహణ ఖర్చులు బాగా పెరిగిపోయా యి. ఒక్కొక్క దుకా ణానికి వెయ్యి కార్డులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో అంగన్‌వాడీలకు సరుకులు పంపిణీ చేసినందుకు డీలర్లకు కమీషన్ రావాల్సి ఉంది. ఇందుకు సంబంధించి రూ.1.20 కోట్లను ప్రభుత్వం జిల్లాకు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని అధికారులు వెంటనే డీలర్లకు చెల్లించాలి.

- కృష్ణారెడ్డి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మోదీ పాలనలో పెరిగిన మతోన్మాదం

● డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి

కావలిటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దేశాన్ని సమగ్రా భివృద్ధి చేస్తే ప్రధాని నరేంద్ర మోదీ మతోన్మాదాన్ని అభివృద్ధి చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆరోపిం చారు. శనివారం కావలిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్యాణ్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ట్రంకురోడ్డులోని అంబేద్కర్, మాజీ మంత్రి దివంగత యానాదిరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ చంద్ర బాబు సూపర్‌సిక్స్ అని అధికారంలోకొచ్చి సిక్స్ కాదు కదా కనీసం ఫోర్ కూడా కొట్టలేకపోతున్నారన్నారు. చంద్రబాబు, నితీష్‌ల పుణ్యంతో మోదీ మూడవసారి ప్రధాని అయ్యారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునేందుకు చంద్రబాబుకు మంచి అవకాశం వచ్చినందున ప్రత్యేక హోదా సాధించాలని డిమాండ్ చేశారు. పేదల అభివృద్ధి సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. చంద్ర బాబు, జగన్ ఇద్దరిది కాంగ్రెస్ డీఎన్ఎ అని, కాంగ్రెస్‌ని విమ ర్శించే హక్కు వారికి లేదన్నారు. జగన్ తిరిగి కాంగ్రెస్‌లో వస్తా రని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి, కార్యదర్శి నరసింహులు, మానస, హుస్సేన్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు క్రీడలు దోహదం

- డీఎస్పీ శ్రీధర్
- జాతీయ స్థాయి టెన్నీస్ పోటీలు ప్రారంభం

కావలిటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ సమ్మైకతకు క్రీడలు దోహదం చేస్తాయని కావలి డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. అఫిషియల్ క్లబ్, కావలి టెన్నీస్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి, సుజనమ్మ ట్రస్ట్ జాతీయస్థాయి డబుల్స్ టెన్నీస్ టోర్నమెంట్‌ను శని వారం అఫీషియల్ క్లబ్ కోర్టులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందరంగా డీఎస్పీ మాట్లాడుతూ 60, 70 ఏళ్ల క్రీడాకారులు ఇత ర రాష్ట్రాల నుంచి కావలికి వచ్చి టెన్నీస్ పోటీల్లో పాల్గొనడం యువ క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తిదా యకమన్నారు. అనుమలశెట్టి రామకృష్ణ మాట్లా డుతూ 30 ప్లస్ నుంచి 70 ప్లస్ వరకు 5కేటాగిరీ లలో డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నామని, 6 రా ష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. టోర్న మెంట్ కమిటీ అధ్యక్షుడు అనుమలశెట్టి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, తహసీల్దారు పీ.శ్రావ ణ్‌కుమార్, క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, బాల్‌బా ట్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు విజయ్‌శం కర్‌రెడ్డి, వంశీమోహన్, టీచర్ ప్రతాప్, బీజేపీ నేత చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



టెన్నీస్ పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్, పక్కన తహసీల్దారు శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ తేజస్వి

వెంకటాచలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విక్ర మ సింహపురి యూని వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ ఎల్. తేజస్వికి శనివారం విజయ వాడలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది జనవరి 26న న్యూ ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించినందు కుగాను ఈ ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడారు. ఎన్ఎస్ ఎస్ వాలంటీర్ తేజస్వి అందుకున్న గౌరవం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయ కమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కే.విద్యప్రభాకర్, డాక్టర్ ఎస్‌బీ.సాయినాథ్, డాక్టర్ బీవీ.సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

మోయలేని భారంగా కరెంటు చార్జీలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ ● విద్యుత్ భారాలపై పుస్తకావిష్కరణ



విద్యుత్ చార్జీల భారాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యుత్ చార్జీల భారాలతో ప్రజలు అల్లాడిపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విద్యుత్ భారాలు - ప్రజలపై ప్రభావం అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెరిగితే వ్యతిరేకించిన టీడీపీ, అధికారంలోకి రాగానే విద్యుత్ భారాలను కొనసాగిం చటం దుర్మార్గమ న్నారు. రాష్ట్రంలోని కూటిమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపటం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని గతంలో లోకేష్ పిలుపునివ్వగా, ప్రస్తుతం ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లతో ఉదయం, మధ్యా హ్నం, రాత్రి పూట వేరువేరుగా విద్యుత్ చార్జీలు భారాన్ని మోపేందుకు నిర్ణయం తీసుకోవటం ఏమిటని ప్రశ్నించారు. ఈ భారాలను ఎత్తివేయక పోతే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అజయ్‌కుమార్, రెహనా బేగం, మూలి వెంగయ్య, పుల్లయ్య, గోగుల శ్రీనివాసులు, మోహన్ రావు, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రజలందరి బాధ్యత


సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఎస్ఏ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(విద్య), మార్చి 22 (ఆంధ్ర జ్యోతి) : నీటి సంరక్షణ బాధ్యత ప్రజలందరిపై ఉందని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డి నేటర్ డీ వెంకట సుబ్బ య్య అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్రశిక్ష కార్యాలయంలో శనివారం ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ నీటి వినియోగం లేనిదే మానవ జీవనం లేదని, అమూల్య మైన నీటి వనరులను పరిరక్షించుకోవా లన్నారు. అనంత రం నీటిని వృథా చేయబోమంటూ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

సోమశిలలో 54.449 టీఎంసీల నిల్వ



అనంతసాగరం మార్చి22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శనివారం నాటికి 54.449 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలు వకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

అత్యవసర సమావేశానికి తరలిరండి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి విరుద్ధంగా పాలకులు చేసే విధానాలను కలసికట్టుగా అడ్డుకుని హక్కులను కాపాడుకుందామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు గంటా నరసింహులు పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరులోని నెల్లూరు ఆసుపత్రి సమావేశ మందిరంలో జరిగే అత్యవసర సమావేశానికి జై భీంలందరూ తరలిరావాలన్నారు. సమావేశానికి ఉన్నతాధికారులు, వైద్యులు, లాయర్లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8477
వెండి కిలో ధర	రూ. 100,000
వెండి ఒక గ్రాము	రూ.103.00

న్యూస్ బాక్స్

ఫ్లెక్సీ కూలి మిఠాయి బండి వ్యాపారికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జొన్నవాడ రోడ్డు సెంటర్‌లోని ఫ్లెక్సీ కూలి స్వీట్ బండిపై వ్యాపారి లక్ష్మణ్‌పై పడటంతో అతను కాళ్లకు రక్తగాయాలయ్యాయి. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతనికి చికిత్సలు అందించారు.

బీఎల్‌వోలకు శిక్షణ

మనుబోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం బీఎల్ వోలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 42 మంది బీఎల్‌వోలు ఉన్నారని వీరందరూ తప్పులేని ఓటర్లజాబితాను తయారు చేయాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఓటు నమోదు చేయడం, అర్హులను చేర్చడం, అనర్హులను తొలగించడం వంటి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఓటర్లజాబితాను ఎప్పటికపుడు నవీకరణ చేయాలన్నారు. బీఎల్‌వోలకు ఓటర్ల జాబితా తయారీపై సలహాలు అందజేశారు.

ముగిసిన డిగ్రీ పరీక్షలు

వెంకటాచలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో జరుగుతున్న డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో విజయవంతంగా ముగిసినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్.మధుమతి ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలలో 36 మంది విద్యార్థుల్లో 33మంది హాజరైయ్యారు.

పొగ చూరింది..



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కోవూరు, మార్చి22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో పదోతరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. హైస్కూల్ ఆవరణకు సమీపంలోని ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి పొగ ఎక్కువగా రావడంతో కొద్దిసేపు పరీక్ష రాస్తున్న విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. పొగ విషయాన్ని ఉపాధ్యాయులు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో హుటాహుటిన వారు వచ్చి మంటల్ని అదుపు చేశారు. పొగ ఆగిపోవడంతో ప్రశాంతంగా పరీక్షలు రాశారు.

డీఎంహెచ్‌వో నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన

మనుబోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను శనివారం జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి సుజాత పరిశీలించారు. పనులు ఎప్పటికీ పూర్తి చేస్తారని భవన నిర్మాణ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ నాటికి పనులు పూర్తిచేశామన్నారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సర్వేల వివరాలపై ఆరా తీశారు. ప్రతిఅధికారి ఆసుపత్రి వేళలకు విధుల్లో హాజరు కావాలని ఆదేశించారు. లేకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు కీర్తిప్రియ, సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

పొదలకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయవ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మహమ్మదాపురం పీహెచ్‌సీ, పొదలకూరు కో లోకేటెడ్ పీహెచ్‌సీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ర్యాలీలో నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకావ్య మాట్లాడారు. అంగన్‌వాడీ, పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు క్షయవ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నిర్ధారణ, చికిత్సపై అవగాహన కల్పించాలని సూచించారు. అప్పుడే ప్రజలు పరీక్షల కోసం వైద్యశాలలకు వస్తారని పేర్కొన్నారు. క్షయవ్యాధిని తొలి దశలోనే గుర్తించి మందులు పూర్తిస్థాయిలో వాడితేనయం అవుతుందన్నారు. కార్యక్రమంలో శివకృష్ణ, మల్లికార్జునరెడ్డి, అనురాధ, పవన్ కుమార్, నజ్మా, సూపర్‌వైజర్లు రవికుమార్, శబరినాథ్, ఆరోగ్యసహాయకులు రాధాకుమారి, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పొదలకూరు : ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం అమ్మకాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. శనివారం ఆమె విడవలూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించాలంటే సకాలంలో లారీలు అందుబాటులో ఉండటం లేదని రైతులు కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో అత్యధికంగా బీపీటీలు రకం వరి ధాన్యం సాగు చేశామని, లారీల సమస్య లేకుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముతామని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే జాయింట్ కలెక్టరుతో ఫోన్‌లో మాట్లాడారు. ఇతర జిల్లాల నుంచి లారీలను పంపాలని నియోజకవర్గంలోని రైతులకు ధాన్యం తరలింపుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అదేవిధంగా బాపట్ల జిల్లాకి చెందిన రైస్ మిల్లర్లతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు రైతులకు సకాలంలో లారీలను పంపాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం తరలించిన 24గంటల్లోనే నగదు రైతు ఖాతాల్లోనికి జమ అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, వ్యవసాయశాఖ ఏవో కృష్ణయ్య, సీఈవో దద్దోలు రవి, టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, రామిరెడ్డి విజయబానురెడ్డి, చెముకుల శ్రీనివాసులు, పొన్నలూరు పురందర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

కొడవలూరు,(ఆంధ్రజ్యోతి):మాజీ శాసన సభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి బావ మాతూరు రామసుబ్బారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శనివారం నార్తురాజుపాలెం గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

రూ.26,767 రికవరీకి అధికారుల ఆదేశాలు

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ● చౌకిచర్ల ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణ

విడవలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై స్థానిక మండల కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 15పంచాయతీల్లో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో 908పనులు జరగ్గా ప్రభుత్వం రూ.5.79కోట్లు నిధులను విడుదల చేసింది. ఆ నిధుల వినియోగంపై డ్వామా పీడీ గంగాభవాని, అంబుడ్స్‌మెన్ పర్సన్ ఎం.వెంకటరెడ్డి, డ్వామా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో నగేష్‌కుమారి విచారణ చేపట్టారు. సోషల్ ఆడిట్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద రూ.26,767వేలు రికవరీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడారు. పనులను సక్రమంగా నిర్వర్తించాలని జాబ్‌కార్డులు కలిగిన వారికి తప్పని సరిగా 100రోజులు పనిదినాలను కల్పించాలన్నారు. మాకు రెండు నెలలుగా జీతాలు చెల్లించాలని విడవలూరు, వావిళ్ల గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సోషల్ ఆడిట్‌కి సంబంధించి చౌకిచర్ల గ్రామానికి చెందిన గర్తోటి హరి, సుధాకర్, గర్తోటి శీనయ్యలు ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆరోపణలు చేశారు. జాబ్‌కార్డులు ఉన్నవారికి పనిదినాలను కల్పించక, అనర్హులకు జాబ్‌కార్డులు అందజేసి అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గ్రామంలో సామాజిక తనిఖీలు సక్రమంగా జరగలేదని ఆరోపణలు చేశారు.



సామాజిక తనిఖీలు చేస్తున్న డ్వామా పీడీ , ఇతర అధికారులు

పారదర్శకంగా ఉపాధి పనుల నిర్వహణ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ముత్తుకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం పనులు చేయించడంలో పారదర్శకతతో పాటు రికార్డులు సక్రమంగా నిర్వహించారని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవానీ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి నిధులతో జరిగిన పనులపై శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 17వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆమె మాట్లాడారు. మండలంలో సుమారు రూ.8.72కోట్లతో పనులు చేశామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపైన చేసిన ఆడిట్ నివేదికను అధికారుల సమక్షంలో ఆడిట్ బృందం గ్రామ పంచాయతీల వారీగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, అధికారులు విజయలక్ష్మి, సతీష్‌బాబు, వెంకటేష్‌రెడ్డి, గాయత్రిదేవి, బుజ్జి, అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు పంచాయతీల్లో చెత్త సేకరణపై సర్వే

● పరిశుభ్రతే ప్రభుత్వ లక్ష్యం
● పంచాయతీ విస్తరణాధికారి నారాయణ

మనుబోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని 5పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి చెత్తసేకరణ సర్వే చేపడుతున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి నారాయణ తెలిపారు. శనివారం కాగితాలపూరు, చెర్లోపల్లి, మనుబోలు, జట్లకొండూరు, మడమనూరు గ్రామాల్లో చెత్తసేకరణపై ప్రజాభిప్రాయం తీసుకున్నారు. గ్రీన్ అంబాసిడర్లతో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ చేస్తున్నారా లేదా అని ప్రజలతో మాట్లాడారు. అలాగే రోడ్లపై, వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తవేయరాదని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా చేస్తామన్నారు. ఐవీఆర్ఎస్‌తో ప్రజలకు నేరుగా ఫోన్‌చేసి ప్రభుత్వం వివరాలు సేకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వేలపై ప్రగతి చూపాలి

సైదాపురం,మార్చి22(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలపై ప్రగతి చూపాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వేలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పీ4 సర్వేకి సబంధించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. సర్వేలపై మరింత ప్రగతి చూపి అటెండెన్స్ శాతం మెరుగు పరచాలన్నారు. కార్యక్రమంలో ఏవో మురళీకృష్ణ, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర, జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ నిర్లక్ష్యమే..!

● వైఎస్ఆర్ ఆర్‌బీకే పేరుతోనే స్లిప్పులు
● గొలగమూడి రైతు సేవా కేంద్రంలో ఓ రైతుకు అందజేత

వెంకటాచలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10నెలలైనా నేటికి అధికారుల తీరు మారలేదు. అందుకు ఉదాహరణ గొలగమూడి రైతుసేవా కేంద్రంలో చోటు చేసుకుంది. ఈ నెల 21న పెంచల్‌నాయుడు పండించిన వరి ధాన్యాన్ని తీసుకుని రైతుసేవా కేంద్రానికి వెళ్లాడు. అక్కడ వరి ధాన్యంలోని తేమశాతాన్ని మిషన్ ద్వారా పరిశీలించారు. ఆ తర్వాత ప్రింటర్ ద్వారా సదరు రైతుకు తేమశాతం వివరాలతో కూడిన ఒక స్లిప్‌ను అందజేశారు. ఆ స్లిప్‌పై డాక్టర్ వైఎస్ఆర్ ఆర్‌బీకే గవర్నమెంట్ ఆఫ్ ఏపీ అంటూ ఉండడం కొసమెరుపు. ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమేనని కూటమి నేతలు, కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. దీని పై పౌర సరఫరాల శాఖ డీఎం వివరణ కోరగా డాక్టర్ వైఎస్ ఆర్ ఆర్‌బీకే పేరుతో స్లిప్పులు ఇవ్వద్దని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని, రైతుసేవా కేంద్రాల్లో ఆ స్లిపులు ఆపేసినట్లు తెలిపారు.

నీచ రాజకీయాలు చేయడం మానుకో..

● టీడీపీ యువనేత బెజవాడ వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొడవలూరు వైసీపీ నేత వీరిచలపతిని అడ్డం పెట్టుకుని కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నీచ రాజకీయాలు చేయడం మానుకోవాలని ఊటుకూరు టీ డీపీ యువనేత బెజవాడ వంశీ కృష్ణారెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై శనివారం ఆయన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాసంలో చేపట్టిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్లలో అధికారంలో ఉన్న ప్రసన్నకుమార్‌రెడ్డి ఎస్టీ, ఎస్సీలకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో నియోజక ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని అది చూసి ఓర్వలేని ప్రసన్న టీడీపీ నాయకులపై నిందులు, అసత్య ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు.

జొన్నవాడ ఆలయంలో రేపు టెండర్లు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో తలనీలాలు సేకరణ, పాద రక్షలు భద్రపరచడం, చాపలు, పీటలు అద్దెకిచ్చే హక్కులపై సోమవారం మధ్యాహ్నం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ. శ్రీనివాసులురెడ్డి శనివారం ప్రటనలో పేర్కొన్నారు. ఆలయానికి ఉత్తరవైపు ఉన్న షాపుల నిర్వహణకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

సాధికారత వైపు అడుగులు వేయాలి

పొదలకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి మహిళా సాధికారత వైపు అడుగులు వేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పొదలకూరు, రాపూరు, కలువాయి, చేజర్ల మండలాల యూటీఎఫ్ ప్రాంతీయ మహిళా సదస్సు నిర్వహించారు. మహిళల వివక్షత పట్ల యూటీఎఫ్ ఉపాధ్యాయల కళాబృందం సభ్యులు బొమ్మలాట పార్వతీశం, ఎస్.సుబ్రహ్మణ్యం అభ్యుదయ, ఉద్యమ, మహిళా చైతన్య గీతాలు ఆలపించి చైతన్యపరిచారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాధ్యక్షులు పి.సుభాషిణీ, జిల్లా కార్యదర్శి ఎస్.రమణయ్య, మండల మహిళా కన్వీనర్ రజనీబాయి పాల్గొన్నారు. అనంతరం మండల విద్యాధికారి కె.రేణుక, సర్పంచి చిట్టెమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు కనకలక్ష్మి, సుజాత, దేవసేన, లూసికుమారి, సమీనాబేగంలను సన్మానించారు.

C.R.I.M.E N.E.W.S

వేర్వేరు చోట్ల పట్టపగలే చోరీ

● బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో శనివారం పట్టపగలే రెండు చోట్ల చోరీ జరిగింది. ఈ చోరీలో బంగారం, వెండి వస్తువులతోపాటు నగదును దుండగులు దోచుకెళ్లారు. ఆ వివరాలు...

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని సమయంలో పట్టపగలే జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ నివాసంలో చోరీ జరిగింది.ఈ సంఘటన శనివారం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు, గ్రామానికి చెందిన భోగ్యం నాగభూషణం స్థానిక మద్యం దుకాణం సమీపంలో కూల్‌డ్రింక్స్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. రోజూ మాదిరిగా దుకాణానికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం సమయంలో ఇంటికి చేరుకున్న ఆయన గేటు తాళాలు పగులకొట్టి ఉండటాన్ని చూసి బెంబేలెత్తిపోయాడు. హడావుడిగా ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను పగులకొట్టిన దుండగులు దుస్తులను చిందర, వందరగా కిందపడేశారు. అందులోని పది తులాల వెండి, రూ. 10వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించి భోరున విలపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొన్న ఎస్‌ఐ రఘునాథ్ సమగ్రంగా పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భోగ్యంవారిపల్లిలో బీరువాను పగులకొట్టి కింద పడేసిన దుస్తులు

● దుత్తలూరులో 11 సవర్ల బంగారం...



దుత్తలూరులో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లో శనివారం పట్టపగలే ఓ నివాసంలో చోరీ జరిగింది. వివరాల మేరకు.. భగవాన్ వెంకయ్యస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న చింతనబోయిన నరేష్ నివాసంలో మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి ముందు గేటు, ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అనంతరం బీరువా తాళాలు ధ్వంసం చేసి అందులోని 11 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. నరేష్ ఇంటికొచ్చి చూడగా గేటు, ప్రధాన ద్వారం తలుపు తాళాలు పగలగొట్టి ఉండడం, బీరువా వస్తువులను చెల్లాచెదరుగా పడేయడం చూసి చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంకు సమాచారం అందించడంతో వారొచ్చి వేలిముద్రలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు బైకును ఢీకొన్న కారు

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై వెళ్తున్న మోటారు బైకును శనివారం వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు, పల్నాడు జిల్లా భీమవరం గ్రామానికి కృపారావు(35), జ్ఞానయ్య(42) ప్రకాశం జిల్లా టంగుటూరులో పొగాకు క్యూరింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిద్దరూ మర్రిపాడు మండలం పొంగూరులోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి మోటారు బైకుపై టంగుటూరుకి ప్రయాణమయ్యారు. ఆ సమయంలో దుత్తలూరు నుంచి లింగసముద్రం వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. దీంతో ఒకరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలవడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయగిరికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రఘునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తీవ్రంగా గాయపడిన కృపారావును ఉదయగిరి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరుకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించాడు.



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

మోటారు బైకుల ఢీ : నలుగురికి గాయాలు



ఉదయగిరి వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఉదయగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న మోటార్ బైకులు ఒకదానికొకటి ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని గన్నేపల్లి సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. ఉదయగిరికి చెందిన చాంద్‌బాషా, కాలేషా, మస్తాన్ బైకుపై మండలంలోని కృష్ణంపల్లిలోని పొలం వద్దకు వెళుతున్నారు. ఈ సమయంలో వారి వెనుకనే అదే పట్టణానికి చెందిన మస్తాన్ బైకుపై వస్తూ గన్నేపల్లి గ్రామ సమీపంలో వారి బైకును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వారికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. వారు వచ్చి గాయపడిన వానిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తెలంగాణ పోలీసు కస్టడీకి మనీస్కాం నిందితుడు

కావలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరులో అనంతార్థ మనీస్కాం నిర్వాహకుడు సుభానీని ఈనెల 20వ తేదీన తెలంగాణ పోలీసులు కస్టడీకి తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మనీస్కాం కేసులో సుభానీని గత నెల 17వ తేదీన కావలి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించడంతో నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు. కాగా ఆయనపై తెలంగాణలోని మక్తల్ పోలీస్ స్టేషన్‌లో కూడా మనీస్కాం కేసులు నమోదై ఉన్నా పోలీసులకు దొరకకుండా మూడేళ్లుగా కావలిలో తలదాసుకున్నారు. ఎప్పుడైతే కావలిలో పోలీసులు అరెస్టు చేశారో గతంలో ఆయనపై మక్తల్‌లో కూడా కేసులు నమోదైనట్లు వెలుగు చూసింది. ఈ విషయం మక్తల్ పోలీసులకు తెలియడంతో వారు కోర్టులో పీటీ వారెంట్ వేసి నెల్లూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సుభానీని విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	104
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 425

'ఫోన్‌కాల్‌తో తిరుమల దర్శనం కల్పించాలి'

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనం టోకెన్ పొందడానికి భక్తులు అనేక అవస్థలు పడుతున్నారు, ఈ క్రమంలో వంట గ్యాస్ బుకింగ్ తరహాలో ఫోన్‌కాల్‌తో టోకెన్ పంపిణీ చేపట్టాలని దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డికి శనివారం అశహరి వెంకటేష్ అనే సంఘ సేవకుడు వినతిపత్రం అందజేశారు. తిరుమలలో అన్నదాన సమయంలో స్వామి వారి నామాల గీతాలను వినిపించే సదుపాయం కల్పించాలని కోరారు. ఆధ్యాత్మిక కేంద్రాలు మానసిక ఆనంద నిలయాలు అని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో బోర్డులు పెట్టాలని కోరారు.

స్మరణోత్సవాల్లో స్వర 'అభిషేకం'

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పురమందిరంలో జరుగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో శనివారం సాయంత్రం చెన్నైకి చెందిన అభిషేక్ రఘురామ్ గాత్ర కచేరీ రాగరంజితంగా సాగింది. పలు కీర్తనలతో త్యాగరాజస్వామికి స్వరాభిషేకం చేశారు. వేదికపై శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం జరిగిన హరికథలు ఆకట్టుకున్నాయి.

త్వరలో అన్నీ పార్కుల్లో వసతులు

● అందుబాటులోకి ఏసీ బస్‌షెల్టర్లు ● మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), మార్చి22, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పార్కులన్నింటిలో ఏప్రిల్ మొదటి వారంలోపు పూర్తి వసతులన్నీ కల్పిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నగరంలోని పలు పార్కులు, కార్పొరేషన్ పాఠశాలలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్కుల్లో వసతుల కల్పన పనులు వేగంగా జరుగుతున్నా యని చెప్పారు. వేసవి తాపం నుంచి నగర వాసులను కాపాడేందుకు త్వరలోనే ఏసీ బస్‌షెల్టర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ బస్ షెల్టర్లు ఏర్పాటు చేసినప్పటికీ ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. నగరంలోని ఆగిపోయిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాల పనులను తిరిగి ప్రారంభించనున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రూ.165 కోట్లను హడ్కో ద్వారా కేంద్ర సహాయంతో నెల్లూరుకు తీసుకువస్తున్నట్లు చెప్పారు. కాగా, గ్రీన్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రం లోని అన్నీ మున్సి పాలిటీల్లో పార్కులు, రోడ్లు, డివైడర్లపై గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీని వాసులురెడ్డి, ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ, ఎం హెచ్‌వో చైతన్య, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నేతలు అనురాధ, విజిత, మధు, బాలాజీ పాల్గొన్నారు.



వీఆర్ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

వీఆర్ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతా

నెల్లూరు(విద్య), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ హైస్కూల్‌ను దేశంలోనే మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఆ స్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. నగరం మధ్యలో ఉన్న వీఆర్ కళాశాలలో గతంలో మూడు షిఫ్టులలో 6,500 మంది విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ తరగతులు జరిగేవన్నారు. తాను కూడా ఇదే పాఠశాల, కళాశాలలో చదువుకున్నానని, లెక్చరర్‌గా పనిచేశానని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద విద్యార్థులకు ఉత్తమ విద్యనందించేలా స్కూల్‌ను తీర్చిదిద్ది దేశంలోనే గుర్తుంపు వచ్చేలా సిద్ధం చేస్తున్నామన్నారు. అత్యాధునిక వసతులతో వచ్చే విద్యా సంవత్సరానికి ప్రారంభించి నర్సరీ నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్యనందిస్తామని ఉద్ఘాటించారు. మురికివాడల్లోని పిల్లలకు ఉచితం ప్రవేశాలు కల్పించి, రవాణా, అల్పాహారం, భోజన వసతి కల్పిస్తామన్నారు. అలాంటి విద్యార్థుల కోసంగా మెప్మా అధికారులు సర్వే చేపడుతున్నారన్నా రు. క్రీడామైదానాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఎండీ భరత్, కలెక్టర్ ఆనంద్, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డీఈవో బాలాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు కృషి చేయండి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీటక జనిత వ్యాధుల నివారణకు ఆరోగ్య సహాయకులు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. శనివారం ఆరోగ్య సహాయకులకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ వ్యాధుల నివారణతోపాటు తప్పని సరిగా ఎఫ్ఆర్ఎస్ నమోదులో సమయపాలన పాటించాలని సూచించారు. మలేరియా నివారణ అధి కారి హంస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులను కలిగించే దోమలను నివారించేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. రక్తపూతల తీసే విధానం, చికిత్స పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అదనపు వైద్యాధికారి నాగార్జునరావు, యూనిట్ అధికారులు, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ఏల సీనియారిటీ జాబితా పూర్తి చేయండి

ఎంపీహెచ్‌వోల సీనియారిటీ జాబితా త్వరగా పూర్తిచేసి ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపాలని కోరుతూ ఎన్జీవో మహాసంఘ్ శనివారం డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందించింది. సంఘ్ జిల్లా కన్వీనర్ ఏవీ శేషయ్య మాట్లాడుతూ 2002 నోటిఫికేషన్ జీవో నెంబర్ 459 ప్రకారం 2024 మార్చిలో ఎంపీహెచ్ఏలను రెగ్యులర్ చేశారన్నారు. ఇందులో 45 నుంచి 55 ఏళ్ల వయసున్నవారు కూడా ఉన్నారని చెప్పారు. వీరికి జోన్ 3 పరిధిలో నెల్లూరుతోపాటు ప్రకాశం, గుంటూరు జిల్లాలు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ విరమణకు తక్కువ కాలం ఉండటంతో ఉద్యోగోన్నతి కల్పించాలని దీనికి సంబంధించి సీనియారిటీ జాబితా తయారు చేసి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో మహాసంఘ్ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందిస్తున్న ఎన్జీవో మహాసంఘ్ నాయకులు

కిమ్స్‌లో అరుదైన ప్లాస్మాపెరోసిస్ శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన ప్లాస్మాపెరెసిస్ శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఆసుపత్రిలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడారు. కావలికి చెందిన పొట్టయ్య(22) అనే యువకుడు ఎలుకల మందు తినడంతో లివర్ దెబ్బతిని అపస్మారక స్థితిలో ఆసుపత్రికి వచ్చాడన్నారు. ఆధునిక వైద్య విధానం ద్వారా పూర్తిగా ప్లాస్మా మార్పిడి చేశామని, బాధితుడు పూర్తిగా కోలుకున్నాడని చెప్పారు. గడ్డిమందు తాగిన వారిని కూడా 4 గంటలలోపు తీసుకుస్తే ఫిల్టర్ శస్త్రచికిత్స ద్వారా బతికించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ జానకిరామ్, సీనియర్ గ్రాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సన్నేష్‌రెడ్డి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

రేపు కాగడాల ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం నగరంలోని సుందరయ్య బొమ్మనుంచి గాంధీబొమ్మ వరకు కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా, నగర కార్యదర్శులు ఎంవీ రమణ, బీపీ నరసింహులు తెలిపారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా శ్రమదానం. రక్తదాన శిబిరాలు, క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, యువత పాల్గొనాలని కోరారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాద, మతోన్మాద వ్యతిరేక పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో డీవైఎఫ్ఐ నాయకులు తిరుపతి జగదీష్, సాయిగణేష్, శీను, నందకిరణ్, శ్రీహరి, జీవన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యలో రాణించాలి

● బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి ● 93 మందికి రూ.8.8లక్షల 'ఉపకారం'

నెల్లూరు(విద్య), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బాలబాలికలు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి పీ వెంకట లక్ష్మి పిలుపునిచ్చారు. నెల్లూరులోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన మలబార్ గోల్డ్ చారిటబుల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు ప్రణాళి కాబద్ధంగా కృషి చేయాలన్నారు. ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ 2022 నుంచి క్రమం తప్పకుండా మలబార్ సంస్థ స్కాలర్‌షిప్‌లు అందిస్తోందని చెప్పారు. ఈ ఏడాది 93 మందికి రూ.8.8 లక్షలు అందించారంటూ ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవీఈవో మధుబాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే కొండయ్య, రిటైర్డ్ లెక్చరర్ కే కుసుమకుమారి, మలబార్ గోల్డ్ స్టార్ హెడ్ సాహిల్, అసిస్టెంట్ స్టోర్ హెడ్ అమ్మాల్, మేనేజర్ తివారి, మార్కెటింగ్ మేనేజర్ గోకుల్ తదితరులు పాల్గొన్నారు.



ఉపకారవేతనాల చెక్కు అందిస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి, ఆర్ఐవో, మలబార్ గోల్డ్ ట్రస్ట్ ప్రతినిధులు

సైకిల్ యాత్రకు జనసేన స్వాగతం

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌పై అభిమానంతో విశాఖ పట్నం నుంచి తిరుమలకు సైకిల్ యాత్ర చేస్తున్న అభిమాని తాతా బాబురావుకు నగరంలో జనసేన పార్టీ నాయకులు శనివారం స్వాగతం పలికారు. నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ తన అభిమానులకు కొండంత అండగా ఉంటారన్నారు. బాబురావు మాట్లాడుతూ జనసేన అధికారంలోకి వస్తే సైకిల్ యాత్ర చేస్తానని దేవుళ్లకు మొక్కుకున్నానన్నారు. ఈ క్రమంలో తిరుమలకు వెళ్లి స్వామిని దర్శించుకుని, అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి పెద్దమ్మ తల్లిని దర్శించుకుంటానని చెప్పారు. హైదరాబాద్‌లో చిరంజీవిని కలుసుకొని తిరిగి విశాఖపట్నం చేరుకుంటాన న్నారు. అతనికి జనసేన నాయకులు పండ్లు, తినుబండారాలు అందించి వీడ్కోలు పలికారు. కాగా, జనసేన జిల్లా కార్యాలయంలో శనివారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సుధామాధవ్, వెంకట్ తాల్లూరి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.



బాబురావుకు పండ్లు అందిస్తున్న మల్లికార్జున యాదవ్

'కసుమూరు రెసిడెన్సీ బాధితులకు న్యాయం చేయండి'

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వెంకటాచలం మండలం పాలిచర్లపాడు గ్రామంలో ఎస్ఎస్ఆర్ ఆర్కేడ్ ప్రైవేటు లిమిటెడ్ కసుమూరు రెసిడెన్సీ బాధితులకు న్యాయం చేయాలని మల్లి శ్రీనివాసులు, తుమ్మ మునిరత్నం కోరారు. శనివారం జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కసుమూరు రెసిడెన్సీలో 2017 నుంచి దశలవారీగా 326 మంది ప్లాట్లు కొనుగోలు చేశారన్నారు. 2022లో ఆ భూమిని కొందరు దున్నేశారన్నారు. న్యాయం చేయమని ఎంతమంది అధికారులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయొద్దు

● న్యాయాధికారులు వాణి, వినోద్

నెల్లూరు రూరల్, మార్చి22, (ఆంధ్రజ్యోతి) : కని, పెంచిన తల్లిదండ్రు లను వృద్ధాప్యంలో నిర్లక్ష్యంగా చేయకూడదని, అలా చేయడం హేయమైన చర్యని న్యాయాధికారులు కే వాణి, వీ వినోద్ అన్నారు. శనివారం నారాయణరెడ్డిపేటలోని బాపూజీ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పి, ప్రయోజకులను చేసిన తల్లిందడ్రులను కొందరు వృద్ధాప్యంలో బయటకు గెంటేస్తున్నారన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు 2007లో తల్లిదండ్రుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఈ చట్టం తల్లిదండ్రుల నుంచి ఆస్తులు పొందిన వారసులందరికీ వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు అనిల్ కుమార్, ఎస్ అనూష, సింహ, రావు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



న్యాయ సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారులు

పదోన్నతులు కల్పించండి : జేసీకి వీఆర్వోల వినతి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ జిల్లా వీఆర్వోల సంఘం నాయకులు శనివారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలోని అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. అలాగే గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రేడ్-1 వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ఇతర శాఖల పనులు, సర్వేల నుంచి వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉద్యోగోన్నతిపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పంట అశోక్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణయ్య, నాగేశ్వర్‌రావు, తిరు మలరాజు, రాజేశ్వరి, మునిబాబు, రవిశేఖర్, చిరంజీవి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తిని చాటిచెప్పేలా ఎదగాలి

● మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

నెల్లూరు (వైద్యం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళా శక్తిని చాటి చెప్పేలా మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని సీపీఐకి చెందిన ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ పిలుపునిచ్చారు. శనివారం పురమందిరం రీడింగ్ రూమ్‌లో జిల్లా అధ్యక్షు రాలు వనజ అధ్వర్యంలో సమాఖ్య మహాసభ జరిగింది. దుర్గాభవానీ మాట్లాడుతూ స్వా తంత్ర్య పోరాటంలోనూ మహిళలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచార న్నారు. అయితే దేశ, అంతర్జాతీయ స్థాయిలో మహిళలు ఇంకా వివక్షకు గురవుతున్నారని, వారిలో చైతన్యం అవసరమ న్నారు. దేశ జనాభాలో సగం మహిళలేనని, ప్రస్తుతం వీరి పరిస్థితి ఏమిటి?, సమాజాభివృద్ధికి ఎలాంటి సహకారం ఉందో ఒక్కసారి ఆలోచించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ విదేశాలు అంతరిక్షంలోకి మహిళలను పంపిస్తుంటే దేశంలో సనాతం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, నగర కార్యదర్శి అరిగెల సాయి, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు జీలానీ ఖాన్, రామరాజు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ఉద్యోగుల బకాయిల చెల్లింపుపై హర్షం

నెల్లూరు(విద్య), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల ఆర్థిక బకాయిలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.6,200 కోట్లు విడుదల చేయడం అభినందనీయని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు చెవుల రామచంద్ర యాదవ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల బకాయిల చెల్లింపులో విఫలమైందని విమర్శించారు. త్వరలోనే పీఆర్సీని ఏర్పాటు చేయడంతోపాటు డీఏ బకాయిలూ విడుదల చేయాలని కోరారు.

గుప్తా పార్కులో కొత్త వెలుగులు

నెల్లూరు (వైద్యం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్ లక్ష్మణ గుప్తా పార్కుల్లో మంత్రి నారాయణ చొరవతో కొత్త వెలుగులు విరజిమ్మాయి. శనివారం ఆ పార్కులో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ధర్మ వరం గణేష్ నూతన లైటింగ్ విధానాన్ని పరిశీలించారు. కలవ కుంట భాస్కర్, కంచి కృష్ణ, వీరమల్లు చంద్ర, మురళీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రవాణా అధికారుల తనిఖీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముత్తుకూరు గేటు సెంటర్‌లో రవాణాశాఖ అధికారులు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాల నెంబర్ ప్లేట్, బాక్ గ్లాస్, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి పరిశీలించి, నిబంధనలు పాటించని వాహనదారులపై 50 కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రఫీ, ఏఎంవీఐలు కార్తీక్, పూర్ణ, రఘు, స్వప్నిల్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సునీతకు అభినందనలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో శనివారం వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు అభినందనలు తెలిపారు. 9 నెలలు అంతరిక్షంలో ఉండి క్షేమంగా తిరిగి వచ్చినందుకు ఆమె ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, నెరసం రాష్ట్ర కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, రచయిత్రులు నజ్మ, జయలక్ష్మీ, నాగేశ్వరమ్మ, శశికళ, జైభారతి, యామిని తదితరులు పాల్గొన్నారు.

నలుగురు రౌడీషీటర్ల బైండోవర్

నెల్లూరు(క్రైం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు రౌడీషీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. చిన్నబజారు ఎస్ఐ అబ్దుల్ రజాక్ శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా గాంధీబొమ్మ సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా మెక్లిన్స్ రోడ్డుకు చెందిన రౌడీషీటర్లు షేక్ సుల్తాన్, షేక్ మౌలాలి, కోటమిట్టకు చెందిన రౌడీషీటర్ షేక్ సందానీ, ఇరగాళమ్మ సంఘానికి చెందిన చిన్నాగా గుర్తించారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేశారు.


మోసం ఆరోపణలతో ఇద్దరిపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట ఓ యువకుడిని మోసం చేసినందుకు ఇద్దరిపై వేదాయపాళెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళేనికి చెందిన శివకుమార్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నగరానికి చెందిన మనోజ్‌కుమార్ రూ.2.60 లక్షలు తీసుకొని ఓ కంపెనీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారు. శివకుమార్ ఆ కంపెనీలో 2023 అక్టోబరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరారు. నెలలు గడుస్తున్నా కంపెనీ నుంచి జీతం రాకపోవడంతో 2024 మేలో కంపెనీ సీఈవో సాయికుమార్‌తోపాటు మనోజ్ కుమార్‌ను కలిశారు. జీతం ఇవ్వాలని కోరగా వారు కాలయాపన చేయడంతో శివ కుమార్ ఉద్యోగం మానేస్తున్నానని, తన వద్ద తీసుకున్న రూ.2.60 లక్షలు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేశారు. వారు వడ్డీతో సహా చెల్లిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఫలితం లేకపోవడంతో బాధితుడు శనివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫిర్యాదు వెనక్కి తీసుకోకుంటే అంతం చేస్తా

● జిల్లా కోర్టు వద్ద మహిళకు బెదిరింపులు

నెల్లూరు(క్రైం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో ఓ మహిళను అంతం చేస్తానని బెదిరించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మూలాపేటకు చెందిన సంధ్య, అనిల్‌కుమార్ దంపతులు వారి ఇంటి పత్రాలు తాకట్టు పెట్టి వచ్చిన నగదును స్నేహితుడు శ్రీధర్‌కు అప్పుగా ఇచ్చారు. అయితే శ్రీధర్ నగదు చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతుండటంతో ఇటీవల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితులు ఫిర్యాదు చేశారు. శనివారం సంధ్య పని మీద జిల్లా కోర్టు వద్దకు వెళ్లగా శ్రీధర్ ఆమెను అడ్డుకొని తనపై ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని, లేకపోతే అంతం చేస్తానని బెదిరించాడు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతి శిబిరానికి

అపూర్వ స్పందన



- ప్రారంభించిన కలెక్టర్ వెంకటేశ్వర్
- ప్రముఖ డాక్టర్ల పర్యవేక్షణలో హెల్త్ మీట్
- నేటితో ముగియనున్న వైద్య శిబిరాలు

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో మొదలైన వైద్యజ్యోతి శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు శిబిరానికి హాజరై ఉచితంగా వైద్య సలహాలు తీసుకున్నారు. శనివారం ఉదయం తుడా సర్కిల్లోని ఇందిరామైదానంలో ఏర్పాటుచేసిన ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతి కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. వివిధ ఆస్పత్రులు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. ఆయా ఆస్పత్రులు అందించే వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వైద్యజ్యోతి శిబిరంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది రాత్రి 8 గంటల వరకు సేవలందించారు. ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేశారు. అంతేకాకుండా రోగులకు అవసరమైన చికిత్స కోసం సంబంధిత ఆస్పత్రులకు వెళ్లేవారికి ప్రత్యేక రాయితీలను అందించారు.

నేడు కూడా హెల్త్ క్యాంప్

ఆదివారం కూడా మెగా హెల్త్ క్యాంప్ ఇందిరా మైదానంలో కొనసాగనుంది. తిరుపతిలోని ప్రసిద్ధ ఆస్పత్రుల స్టాళ్లలో ఉచితంగానే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ డాక్టర్లు పాల్గొంటారు. తిరుపతి నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

ప్రసిద్ధ ఆస్పత్రుల వైద్య సేవలు :

ఆంధ్రజ్యోతి- వైద్య జ్యోతిలో వెంకటరమణ గుండె, మెటర్నిటీ హాస్పిటల్ స్టాల్లో ఈసీజీతో పాటు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు ఇచ్చారు. మనోహరి రామచంద్ర హాస్పిటల్, అంకుర హాస్పిటల్స్ వారు తమ స్టాళ్లలో గర్భిణులు, తల్లి కావాలనుకునే మహిళలకు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. గర్భం దాల్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భస్థ శిశువుల ఆరోగ్య మెలకువలను వివరించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు ప్రధానంగా ఆర్థోపెడిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డీఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, యష్ హాస్పిటల్స్, శ్రీసాయి సుధా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, డీబీఆర్ అండ్ ఎస్కే క్యాన్సర్ సెంటర్, మెడిగో హాస్పిటల్స్, సన్‌ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ స్టాళ్లలో వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.కాకర్ల డెంటల్ హాస్పిటల్, కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్స్ వారు దంత సంబంధ పరీక్షలు నిర్వహించి, అధునాతన దంత వైద్యంపై అవగాహన కల్పించారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య సమస్యలతో సతమతం అయ్యే చాలామంది ఏ ఆస్పత్రికి వెళ్లాలో, ఏ డాక్టర్‌ను కలవాలో తెలియక ఇబ్బందిపడుతూ ఉంటారు. అటువంటి వారి కోసం ఒక్క చోటే ఇంత పెద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం. తిరుపతిలోని ప్రసిద్ధ ఆస్పత్రులన్నీ ఇక్కడ కన్పిస్తున్నాయి. ప్రముఖ డాక్టర్లంతా వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు ఇవ్వడం గొప్ప విషయం. ఇక్కడ పరీక్షలు చేయించుకున్నవారికి తమ ఆస్పత్రుల్లో ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తామంటున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలోకి రాని కొన్ని వ్యాధులకు ఇక్కడ ఉచితంగా చికిత్స దొరుకుతోంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ మెగా హెల్త్‌మీట్ నిర్వహించిన ఆంధ్రజ్యోతి- ఏబీఎన్‌కి ప్రత్యేక అభినందనలు.

- కలెక్టర్ వెంకటేశ్వర్

ఉచితంగా మందులు

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (ఎన్‌బీకే) ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పి.మనోహర్ రెడ్డి, కేపీ చౌదరి ప్రధాన స్పాన్సర్‌గా, సీపీఆర్ కనస్ట్రక్షన్స్ వారు కో స్పాన్సర్‌గా వ్యవహరించి రోగులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇంఛార్జి వి.సుధాకరబాబు, ఏడీవీటీ ఇంచార్జి ఈశ్వరనాయుడు, ప్రొడక్షన్ ఇంచార్జి మోహన్ రావు, సర్క్యులేషన్ ఇంచార్జి ఉమాపతి, బ్యూరో ఇన్‌ఛార్జి శివప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.నరేంద్ర, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ శంకర్ రెడ్డి , ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు టీటీడీ బోర్డు సమావేశం

- సీఎం సూచనలపై చర్చ
- 2025-26 బడ్జెట్ సమర్పణ

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. అన్నమయ్య భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అలాగే గతంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించడంతో పాటు ఇప్పటికే సిద్ధం చేసిన అజెండాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చిన సీఎం చంద్రబాబు బోర్డుకు, అలాగే సభ్యులకు చేసిన పలు సూచనలపై కూడా చర్చించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం నూతన ట్రస్టును ఏర్పాటు చేయాలనే సూచనకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. అలిపిరిలో కొండలకు వెంబడి ఉన్న ప్రాంతాన్ని టెంపుల్ కారిడార్‌గా చేసే అంశంపైనా చర్చించనున్నారు. అన్యమత ఉద్యోగుల తరలింపు, శ్రీవారి ఆస్తుల పరిరక్షణ వంటి అంశాలు కూడా చర్చకు రానున్నాయి.

తిరుమలలో మళ్లీ ప్లాస్టిక్ బాటిల్స్?

గాజుసీసాల స్థానంలో అనుమతించేందుకు టీటీడీ యోచన

తిరుమల, మార్చి22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గాజు నీళ్ల సీసాల స్థానంలో మళ్లీ ప్లాస్టిక్ బాటిల్స్‌ను అనుమతించే ఆలోచనలో టీటీడీ ఉన్నట్టు తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణ దృష్టితో 2020లో తిరుమలలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. ఇందులో భాగంగానే వాటర్ బాటిళ్ల స్థానంలో గాజు సీసాలు ప్రవేశపెట్టారు. ఒక లీటర్ బాటిల్ రూ.50. ఏ దుకాణంలో బాటిల్ వెనక్కి ఇచ్చినా రూ.30 ఇస్తారు. అయితే చాలామంది భక్తులు వెనక్కివ్వకుండా పడేస్తున్నట్టు గుర్తించారు. ఇవి పగిలి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనికితోడు గొడవపడ్డ సమయంలో భక్తులు గాజు సీసాలను ఆయుధాలుగా వాడేస్తున్నారు.



గాజు వాటర్ బాటిళ్లు

గత జూలైలో వైజాగ్‌కు చెందిన ఒక కుటుంబంతో మాటామాటా పెరిగి దుకాణంలో పనిచేసే వ్యక్తి గాజు సీసాతో దాడి చేయడంతో భక్తుడు, అడ్డు వెళ్లిన హోంగార్డు గాయపడ్డారు. తాజాగా గురువారం మరో సంఘటనలో కర్ణాటక, తమిళనాడు భక్తుల మధ్య జరిగిన ఘర్షణలో గాజు బాటిల్‌తో దాడిలో ఇద్దరు రక్తగాయాల పాలయ్యారు. వీటి స్థానంలో బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ బాటిళ్లు, టెట్రా వాటర్ ప్యాకెట్ల వినియోగంపై టీటీడీ ఉన్నతాధికారులకు కొన్ని సంస్థలు డెమో ఇచ్చాయి.వీటి వినియోగంపై పరిశీలనకు ఓ ప్రత్యేక కమిటీని టీటీడీ ఈవో శ్యామలరావు నియమించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.





భువన్‌మనో (ఫైల్ ఫొటో)

లారీని ఢీకొని బైక్‌పై నుంచి కిందపడ్డ భువన్‌మనో, వంశీ

పరీక్షకు వెళ్తూ ఇంజనీరింగ్

విద్యార్థి మృతి

మరో విద్యార్థికి తీవ్రగాయాలు

వడమాలపేట/బైరెడ్డిపల్లె, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పరీక్షకు వెళ్తూ మృత్యువాత పడ్డాడో ఇంజనీరింగ్ విద్యార్థి. మరో విద్యార్థి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై వడమాలపేట టోల్‌ప్లాజా వద్ద శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామానికి చెందిన వెంకటరామయ్య కుమారుడు వంశీ(20), బైరెడ్డిపల్లె మండలం గాజీపేటకు చెందిన నరసింహులు కుమారుడు కేఎన్ భువన్‌మనో(20) పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. తిరుపతి సమీపంలోని చెర్లోపల్లి అయాన్ డిజిటల్ కేంద్రంలో జరుగుతున్న ఎన్‌పీ టెల్(నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్) ఆన్‌లైన్ కోర్సు పరీక్ష రాసేందుకు కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. చెన్నై నుంచి కర్నూలుకు జిప్సం లోడ్‌తో వెళుతున్న టీఎన్ 23 బీఈ 8084 నంబరు లారీని టోల్‌గేట్ సమీపంలోని చెట్టినాడ్ హోటల్ వద్ద భోజనం కోసం డ్రైవర్ రోడ్డు పక్కగా నిలిపే ప్రయత్నం చేశాడు. దీన్ని గమనించేలోపు భువన్‌మనో నడుపుతున్న ద్విచక్ర వాహనం లారీ వెనుక భాగంలో ఢీకొంది. ఈ ఘటనలో భువన్‌మనోకు హెల్మెట్ లేకపోవడంతో తల బలంగా ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు.వెనుక కూర్చు న్న వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ధర్మారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వంశీని 108లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. భువన్‌మనో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి పంపించారు.అది పూర్తయ్యాక శనివారం రాత్రి భువన్ మృతదేహం గాజీపేట చేరింది. ఆదివారం స్వగ్రామంలో భువన్ అంత్యక్రియలు జరగనున్నాయి.

ఇకపై గంట ముందే పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత కారణంగా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సమయంలో మార్పు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి ప్రతి సోమవారమూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్, మండల కేంద్రాల్లోనూ ఇదే సమయంలోనే నిర్వహించనున్నట్లు వివరించారు. అధికారులు ఈ మార్పును గమనించి దానికనుగుణంగా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

నెలాఖరులోగా ఈకేవైసీ తప్పనిసరి

- లేకుంటే ఏప్రిల్ నుంచి రేషన్ కట్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేసుకోని రేషన్‌కార్డుదారులకు ఏప్రిల్ నుంచి రేషన్ సరుకులు బంద్ చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 6.35లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రేషన్ దుకాణాలతో పాటు మీ-సేవ, ఆధార్ కేంద్రాల్లో, సచివాలయాల్లో ఈకేవైసీ చేసుకోవచ్చునని డీఎస్ఓ శేషాచలం రాజు చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు మినహా మిగిలిన వారు తప్పనిసరిగా చేసుకోవాలని పేర్కొన్నారు. రేషన్ దుకాణాలకు వెళ్లి ఈపోస్‌పై వేలిముద్ర వేస్తే డీలర్ లాగిన్‌లో ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చని వివరించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు

'కార్ అండ్ బైక్ రేస్' విజేతల ప్రకటన

కూపన్లు తీసి విజేతలను ప్రకటించిన ఎమ్మెల్యే ప్రశాంతి, 'శుభమస్తు' అధినేత బయ్యా రవి

బహుమతుల బొనాంజా!

- **ప్రథమ బహుమతి**
  ఎస్‌కే. మస్తాన్‌బీ, 4/23-5, శ్రామికనగర్ రోడ్, కొత్తూరు, నెల్లూరు.
- **ద్వితీయ బహుమతి**
  పొన్నూరు గిరిబాబు, 7-8-40, కోటంరెడ్డివారి వీధి, కావలి
- **తృతీయ బహుమతి**
  మేకల రాజేశ్వరి, 26-3-883, జ్యోతినగర్, 6వ వీధి, వేదాయపాళెం, నెల్లూరు.
- **వంద మందికి కన్సొలేషన్ బహుమతులు**

అక్షరమే ఆయుధంగా పునఃప్రారంభమైన ఆంధ్రజ్యోతి జనాదరణే ఊపిరిగా 22 ఏళ్ల పూర్తి చేసుకున్నది. ఇన్నేళ్ల ప్రస్థానంలో చురకలంటించే కథనాలతోపాటు ఆదరాభిమానం చూపుతున్న పాఠకులకు ఎన్నో బహుమతులు అందజేస్తోంది. అందులోభాగంగా 22వ వార్షికోత్సవం సందర్భంగా 'కార్ అండ్ బైక్ రేస్' పేరిట పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024, నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కూపన్లను పాఠకులు ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపారు. ఇలా వేలాదిగా వచ్చిన కూపన్లలో విజేతలను శనివారం సాయంత్రం నెల్లూరులోని ప్రధాన కార్యాలయం వద్ద ఎంపిక చేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా రవి, ఏజెంట్లు, పాఠకులు పాల్గొన్నారు. ముందుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అతిథులు ఎంపిక చేయగా, వంద కన్సొలేషన్ బహుమతుల విజేతలను ఏజెంట్లు, పాఠకులు కూపన్ల ద్వారా ప్రకటించారు.

వివరాలు 8లో..



వేలాది కూపన్లలో నుంచి ప్రథమ బహుమతి విజేత కూపన్‌ను తీస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కంగ్రాట్స్ మా... బైక్ విజేత మస్తాన్‌బీని ఫోన్‌లో అభినందిస్తున్న ప్రశాంతిరెడ్డి



ద్వితీయ బహుమతి విజేత కూపన్‌ను చూపుతున్న బయ్యా రవి

రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌కు 10మంది విద్యార్థుల ఎంపిక

చిత్తూరు సెంట్రల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంటుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, నెహ్రూ యువకేంద్ర యూత్ అధికారి ప్రదీప్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుశీలా భారతి శనివారం తెలిపారు. శుక్రవారం పీవీకేఎన్‌లో భారత ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించగా 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు.75మంది ఒకేదేశం-ఒకే ఎన్నిక అనే అంశంపై ప్రసంగించిన విషయం తెలిసిందే. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన హరినాయుడు, మనోహర్, మునిచంద్ర నాయుడు, ఉమాదేవి, ప్రదీప్‌కుమార్‌లు 10మంది విద్యార్థులను ఎంపిక చేశారు.వీరంతా ఈనెల28న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే యూత్ పార్లమెంట్‌లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముందు తమ వాణి వినిపించనున్నారు.



దర్శకుడు క్రిష్ - అమరనాథ్ నంబూత్రి

తిరుమలలో దర్శకుడు క్రిష్

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు క్రిష్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే అమరనాథ్ కేదార్‌నాథ్ వంశపారంపర్య అర్చకులు అమరనాథ్ నంబూత్రి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

అహోబిలం పీఠాధిపతికి టీటీడీ పెద్ద మర్యాద


తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): అహోబిలం పీఠాధిపతి శ్రీరంగనాథ యతీంద్ర జీయర్‌స్వామి శనివారం టీటీడీ పెద్ద మర్యాదతో శ్రీవారిని దర్శించుకున్నారు. అఖిలాండం వద్ద పీఠాధిపతికి టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం శఠగోపంతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

టెంపుల్ కారిడార్‌గా అలిపిరి మంచి నిర్ణయం: భానుప్రకాష్



తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): అలిపిరి ప్రాంతాన్ని టెంపుల్ కారిడార్‌గా నిర్ణయించి భవిష్యత్తులో ఎలాంటి ధార్మిక వ్యతిరేక కార్యక్రమలూ జరగకుండా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. తిరుమల ఆలయం ముందు శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను సీఎం చంద్రబాబు రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇక, శ్రీవారి ఆలయంలోని పరకామణిలో జరిగిన కోట్లాది రూపాయల దొంగతనంపై సీఐడీ విచారణకు డిమాండ్ చేస్తున్నానన్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,170
తలనీలాలు సమర్పించినవారు: 26,821

‘తుడా’ టవర్స్‌కు పెరుగుతున్న క్రేజ్

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఇక ఆకాశ హర్మ్యాలు రాబోతున్నాయి. మహానగరాల్లో మాత్రమే కనిపించే ఆధునిక హంగులు, సకల సౌకర్యాల సౌధాలు క్యూ కడుతున్నాయి. చింతలచేనులో ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థ 13 అంతస్తులతో రెసిడెన్షియల్ టవర్స్ నిర్మించింది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో 14 అంతస్తుల్లో తుడా టవర్స్ పేరిట వేగంగా నిర్మాణం సాగుతోంది. దీనికి జనం నుంచి క్రేజ్ కనబడుతోంది.

తొలుత 20 అంతస్తులతో ఐకానిక్ టవర్స్ నిర్మించాలని ‘తుడా’ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుంది. డీపీఆర్ సిద్ధం చేసింది. చివరి నిమిషంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అభ్యంతరం చెప్పింది. డీజీసీఏ నిబంధనల ప్రకారం విమానాశ్రయం 5 కి.మీ వ్యాసార్థంలో ఏ భవనం కూడా 45 మీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదు. అంటే భవనం 14 అంతస్తులపైన నిర్మాణం చేయకూడదు. తుడా టవర్స్ దూరం 10 కి.మీ పైనే ఉన్నప్పటికీ ఎయిర్ ట్రాఫిక్ ఆ ప్రాంతం నుంచే ఎక్కువగా ఉండడంతో ఎన్వోసీ ఇవ్వనట్టు తెలుస్తోంది. దీంతో 14 అంతస్తులకు పరిమితం చేసుకుని.. మళ్లీ రీడిజైన్ చేసి నిర్మాణం మొదలుపెట్టింది. వైసీపీ హయాంలో తుడా టవర్స్ పునాదుల్లో ఉన్నప్పుడే వేలం పిలిచారు. రెండు, మూడు కమర్షియల్ గదులు తప్ప తక్కినవాటికి బోణీ కాలేదు. ప్రభుత్వం మారితే నిర్మాణం ఆగిపోతుందేమోనన్న భయం కొనుగోలుదారుల్లో కనిపించింది.



ఇప్పుడేమో ప్రభుత్వం మారాక పనులు వేగవంతమయ్యాయి. ఆరంతస్తుల నిర్మాణం పూర్తిచేసుకుని వేలానికి సిద్ధమైంది. ఈనెల 8నుంచి వేలం ప్రక్రియ మొదలైనప్పటికీ శని, ఆదివారాలు సెలవులు రావడంతో మూడు రోజుల్లోనే 23 ప్లాట్లు అమ్ముడుపోయినట్టు అధికారులు చెబుతున్నారు. ‘తుడా టవర్స్‌కు విశేష స్పందన వస్తోంది. ఇప్పటికే కొన్ని బ్యాంకులు, కంపెనీలు ఆఫీస్ స్పేస్ కోసం పోటీ పడుతున్నాయి. వచ్చే ఏడాది మార్చిలోపు కొనుగోలుదారులకు అప్పగిస్తాం’ అని తుడా వీసీ ఎన్.మౌర్య తెలిపారు.

ఏడాదికి అందుబాటులోకి

3.6 ఎకరాల్లో రూ.345కోట్లతో ‘తుడా’ టవర్స్ నిర్మాణం సాగుతోంది. గ్రౌండ్, ఒకటవ అంతస్తుల్లో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్తులలో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన వాటిలో 230 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. వీటిలో 42 డబుల్.. 152 ట్రిపుల్.. 32 నాలుగు బెడ్ రూమ్ ఫ్లాట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. కమర్షియల్, రెసిడెన్షియల్‌కు వేర్వేరుగా పార్కింగ్, లిఫ్టులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాదిలోపు పూర్తిగా అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఐకానిక్ టవర్స్‌లో వసతులు, ధరలు ఇలా..

స్విమ్మింగ్ పూల్, వాకింగ్ పార్కు, పోడియం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రెస్టారెంట్, బంకెట్ హాల్, సూపర్ మార్కెట్, బ్యాంక్, బ్యాడ్మింటన్ కోర్టులు, యోగ ఇతర ఇండోర్ క్రీడల సౌకర్యాలను అందుబాటులో ఉంచనున్నారు. రెసిడెన్షియల్ కోసం 2బీహెచ్‌కే.. 1238 ఎస్ఎఫ్టీ- రూ.70లక్షలు, 3బీహెచ్‌కే.. 1903 ఎస్ఎఫ్టీ- రూ.1.12కోట్లు, 4బీహెచ్‌కే.. 3743 ఎస్ఎఫ్టీ- రూ.2.19కోట్లు చొప్పున ధరలు నిర్ణయించారు. కమర్షియల్ కోసం గ్రౌండ్ ఫ్లోర్.. 42664 ఎస్ఎఫ్టీ- ఒక్కో ఎస్ఎఫ్టీ రూ.12వేలు చొప్పున, ఫస్ట్ ఫ్లోర్ 64724 (రూ.10వేలు), ఆఫీస్ స్పేస్ 89919 ఎస్ఎఫ్టీ (రూ.7,500) ధరగా నిర్ణయించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆఫ్‌లైన్‌లో అద్దె చెల్లింపులకు ఆదేశం

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఇళ్లు, దుకాణాలు, మఠాలు, కార్యాలయాలకు సంబంధించిన అద్దె, కరెంటు, వాటర్ బిల్లులు ఆఫ్‌లైన్ ద్వారా కూడా కట్టించుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను శనివారం ఆదేశించారు. అద్దె, కరెంటు, వాటర్ బిల్లులను ఆన్‌లైన్‌లో కట్టాలనే నిబంధనతో తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న కౌంటర్‌లో కంప్యూటర్‌కు యాక్సెస్‌ను గురువారం నుంచి కట్ చేసిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారంటూ ‘తిరుమలలో ఆగిన ఆఫ్‌లైన్ అద్దె చెల్లింపులు’ శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు స్థానికులకు ఇబ్బంది లేకుండా కౌంటర్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శనివారం నుంచే కౌంటర్‌ను తెరవాలని అధికారులు ఆదేశించినప్పటికీ బ్యాంక్ సెలవు నేపథ్యంలో తిరిగి సోమవారం నుంచి కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని బ్యాంక్ సిబ్బంది తెలిపారు.

అభాగ్యుడికి అండగా...
ఆంధ్రజ్యోతి-వైద్యజ్యోతి

● కలెక్టరు చొరవతో ఉచిత వైద్యానికి భరోసా

తిరుపతి(వైద్యం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు రోజుల వైద్యజ్యోతి మెగా హెల్త్‌క్యాంప్‌లో ఒక అభాగ్యుడికి కలెక్టర్ చొరవతో వైద్య సాయానికి మార్గం సుగమం అయ్యింది. నా అనే వాళ్లు లేక, ఆరోగ్య పరిస్థితి సహకరించక శ్రీకాళహస్తిలోని ఒక అనాథాశ్రమంలో ఉంటూ జీవనం సాగిస్తున్న బందాడ శ్రీనివాస్(76) వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవడానికి శనివారం వచ్చాడు. కలెక్టర్ వెంకటేశ్వర్ అతన్ని పలకరించారు. తన నిస్సహాయ స్థితిని అతను కలెక్టర్‌కి వివరిస్తూ కంట తడిపెట్టుకున్నాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన చేతిలోని మెడికల్ రిపోర్టులన్నీ తీసుకుని పరిశీలించారు. వెంటనే స్విమ్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వృద్ధుడికి అవసరమైన వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందజేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని స్విమ్స్‌కు లేఖ రాసి వృద్ధుడికి అందించి వెంటనే స్విమ్స్‌కు వెళ్లాలని సూచించారు. అందుకు అవసరమైన రవాణా సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయడంతో శ్రీనివాస్ పొంగుతున్న కన్నీళ్లతో కలెక్టర్‌కు చేతులు జోడించారు. ఆంధ్రజ్యోతి-వైద్యజ్యోతి శిబిరానికి రావడం తనకు ఎంతో మేలు చేసిందని కృతజ్ఞతలు తెలిపారు.


కలెక్టర్‌కు నమస్కరిస్తున్న బందాడ శ్రీనివాస్

మరో మైలురాయిని అధిగమించిన శ్రీసిటీ-కొబెల్కో



● కొబెల్కో నుంచి 20,000వ ఎక్స్‌కవేటర్ విడుదల

వరదయ్యపాళెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిర్మాణ పరికరాల తయారీ దిగ్గజ కంపెనీ కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా శ్రీసిటీ ప్లాంట్‌లో 20,000వ ఎస్‌కే 220 ఎక్స్‌కవేటర్ ఉత్పత్తితో ఒక ప్రధాన మైలురాయిని అధిగమించింది. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం కంపెనీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ అద్భుత విజయం పట్ల కేసీఈఐకి ఆయన అభినందనలు తెలిపారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రా సన్నారెడ్డి, కేసీఈఐ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్ సమక్షంలో ఎండీ, సీఈవో టకేమిచి హిరకావా లాంఛనంగా 20,000వ ఎక్స్‌కవేటర్‌ను విడుదల చేసి దానిని తమ ప్రధాన కస్టమర్ కేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జలంధర్‌రెడ్డికి అందజేశారు. టకేమిచి హిరకావా మాట్లాడుతూ ఈ మైలురాయి తమ సంస్థ నిబద్ధతను సూచిస్తుందన్నారు. కేసీఈఐ ప్రారంభం నుంచి తమకు అమూల్యమైన సహకారం అందిస్తున్న శ్రీసిటీ ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ 20,000వ యూనిట్‌ను అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

20,000వ ఎక్స్‌కవేటర్ కీని జలంధర్‌రెడ్డికి అందచేస్తున్న కేసీఈఐ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్, ఎండీ, సీఈవో టకేమిచి హిరకావా, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రా సన్నారెడ్డి తదితరులు

’30 రోజుల్లో తెలుగు రీడింగ్ చాలెంజ్’ ఎంతో ఉపయుక్తం

● ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి(విద్య), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహించిన ‘30 రోజుల్లో తెలుగు రీడింగ్ చాలెంజ్’ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉందని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ పేర్కొన్నారు.తిరుపతికి చెందిన భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చారు. తిరుపతి సంజయ్ గాంధీ కాలనీ మున్సిపల్ పాఠశాల, చంద్రగిరిలోని జేఆర్‌కేఆర్ ప్రాథమిక పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడి విద్యా ర్థులకు శిక్షణ ఇచ్చారు. 30 రోజుల పాటు సాగిన శిక్షణ శనివారంతో ముగిసింది. తిరుపతి సంజయ్‌గాంధీ కాలనీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆర్జేడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 3వ తరగతి విద్యార్థులతో 10వ తరగతి పుస్తకాలను చదివించి శిక్షణ ఫలితాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృభాషలో చదవడం, రాయడం బాగా వచ్చిన విద్యార్థులు ఇతర భాషల్లో కూడా ప్రావీణ్యత సాధించగలరన్నారు. ఈ శిక్షణద్వారా 2, 3 తరగతులు విద్యార్థులు కూడా 10వ తరగతి పాఠ్యపుస్తకాలను ధారాళంగా చదువుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్ని పాఠశాలల్లో 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టేలా ప్రయత్నిస్తామని చెప్పారు. డీఈఓ కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ 30 రోజుల్లో తెలుగు చదవడం, రాయడంపై శిక్షణతో సత్ఫలి తాలు వచ్చాయన్నారు. అనంతరం శిక్షకులు భాస్కర్‌రాజును ఆర్జేడీ, డీఈఓ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, అర్బన్ ఎంఈవో భాస్కర్‌నాయక్, హెచ్‌ఎం ధనుంజయులునాయడు, ఉపాధ్యాయులు పద్మావతి, విజయ్‌కుమారి, అనిత, అనిల్‌కుమార్, ప్రవీణ, లావణ్య, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.


భాస్కర్‌రాజును సత్కరిస్తున్న ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ కేవీఎన్ కుమార్, ధనుంజయులు నాయుడు తదితరులు

సైబర్ వలలో చిక్కిన మహిళ

● రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఒక మహిళ సైబర్ వలలో చిక్కి రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న ఘటన తిరుపతి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు చెప్పిన వివరాల మేరకు.. సాయినగర్ పంచాయతీ టెలిఫోన్ కాలనీకి చెందిన మహిళ కాంట్రాక్టు టీచర్‌గా పనిచేస్తోంది. ఆమె ఇన్వెస్ట్‌మెంటు అలియన్స్ ట్రెయినింగ్ గ్రూపు వీఐపీ సీ9 హరిసింగ్ బుక్ డిస్‌కషన్ కెనాన్ అసెట్స్ దత్తా అనే వాట్సాప్ గ్రూపులో చేరారు. అధిక డబ్బు ఆశ చూపించి గ్రూపు అడ్మిన్లు హరిసింగ్, కెనాన్ అసెట్స్ దుత్తా క్వాలిటీ పవర్ ఐపో బీజెసాన్ ఐపో హెక్సావేర్ టెక్నాలజీస్ ఐపో స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టమని ప్రేరేపించారు. వారు సూచించిన మేరకు బంధన్, ఐడీఎఫ్‌సీ, యూకో, ఆర్‌ఎంజీబీ తదితర 10 బ్యాంకు అకౌంట్లకు ఆమె రూ.55.85 లక్షలు జమచేశారు. కొన్ని రోజుల తర్వాత వాట్సాప్ గ్రూపులు క్లోజ్ అయ్యాయి. నిర్వాహకులు అందుబాటులో లేకుండాపోయారు. మోసపోయానని గుర్తించిన బాధితురాలు వెంటనే సైబర్ క్రైం 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ కేసు నమోదు చేశారు.

రూ.22 లక్షలు పోగొట్టుకున్న మరో యువతి

సైబర్ మోసగాళ్ల వలలో పడి ఓ యువతి రూ.22 లక్షలు పోగొట్టుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ కథనం మేరకు.. స్థానిక జీవకోన గోపాల్‌నగర్‌లో ఉంటున్న రేవతి బీటెక్ వరకు చదువుకుంది. వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేస్తోంది. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ యాప్ ద్వారా ఆమె వాట్సాప్ నెంబరుకు ఓ మెసేజ్ పెట్టారు. టెలిగ్రామ్ యాప్‌లో హోటళ్లకు ఆన్‌లైన్ రివ్యూల ద్వారా రేటింగ్ ఇస్తే డబ్బులు వస్తాయని నమ్మించారు. అలాగే నమ్మకంగా చేస్తే సంస్థలో ఉద్యోగం కూడా ఇస్తామని చెప్పారు. వారి మాటలు ఆమె నమ్మింది. ఇంట్లో ఉన్న బంగారం తాకట్టు పెట్టి కొంత నగదు, తన అకౌంట్లో ఉన్న డబ్బులతో పాటు తెలిసిన వారి వద్ద అప్పులు చేసింది. మొత్తం రూ.22 లక్షలు కేటుగాళ్లు చెప్పిన అకౌంట్లలో నాలుగు విడతల్లో జమచేసింది. ఆ తర్వాత వారి వాట్సాప్ నెంబర్లు బ్లాక్ కావడంతో మోసపోయానని గ్రహించి 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. శనివారం అలిపిరి సీఐ రాంకిషోర్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేశారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల గుర్తింపు

● ఇందులో ఓ పాతనేరస్తుడు కూడా..



తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం పోలీసులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో 72 అనధికార వ్యక్తులను గుర్తించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు మూడు బృందాలుగా ఏర్పడి తిరుమలలోని వరాహస్వామి, కల్యాణకట్ట, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఎలాంటి గుర్తింపు లేకుండా ఉంటున్న 72 మందిని గుర్తించారు. వారి పూర్వాపరాల గురించి ఆరా తీశారు. వారిని తిరుపతి తరలించార. ఇందులో 28 మంది స్త్రీలు ఉన్నారు. పోలీసులు గుర్తించిన అనధికార వ్యక్తుల్లో ఓ పాత నేరస్థుడు కూడా ఉండటం గమనార్హం. ప్రకాశం జిల్లాకు చెందిన రవి అనే పాతనేరస్థుడి వివరాలు బయటపడ్డాయి. తిరుమల ట్రాఫిక్,తిరుపతి ఎంవీఐ మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకుని రూ.1.50లక్షలు జరిమానా విధించారు.

రామచంద్రాపురం ఎస్ఐ వీఆర్‌కు..
ట్రైనీ ఐపీఎస్ హేమంత్‌కు బాధ్యతలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎస్ఐ రామాంజనేయులును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌ను స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఈయన ఎనిమిది నెలల పాటు అక్కడ విధి నిర్వహణలో ఉంటారు.

కేకేసీ కళాశాల విద్యార్థులకు ఘనంగా ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందును ఆరగిస్తున్న విద్యార్థులు

పుత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో వివిధ మతాల విద్యార్థుల మధ్య అన్యోన్యత, సోదరభావం పెంచేందుకు రంజాన్ ఇఫ్తార్ విందును ఆనవాయితీగా అందిస్తున్నామని కేకేసీ హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శరవణన్ తెలిపారు. రంజాన్ ఇఫ్తార్ విందును శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులు రంజాన్ ఉపవాసాలను భక్తి శ్రద్ధలతో చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్లు కుప్పయ్యశెట్టి, నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్లాట్‌ఫామ్ పైకి బ్యాగ్ విసిరిన ప్రయాణికుడు

● నాలుగు కిలోల గంజాయి సీజ్



రైలులో నుంచి విసిరిన బ్యాగ్ - గంజాయి ప్యాకెట్లు

దొరవారిసత్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తు తెలియని ప్రయాణికుడు ప్లాట్‌ఫామ్ పైకి విసిరిన బ్యాగ్‌లో గంజాయి ఉన్నట్లు జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం కామాఖ్య నుంచి చెన్నై మీదుగా యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దొరవారిసత్రం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ పైకి నల్ల బ్యాగ్‌ను విసిరేశాడు. బ్యాగ్‌లో ఏముందోనన్న ఆందోళనతో అప్రమత్తమైన రైల్వేస్టేషన్ సిబ్బంది జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్‌పీ ఎస్ఐ చెన్నకేశవ సిబ్బందితో కలిసి బ్యాగ్‌ను పరిశీలించగా నాలుగు కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. తమిళనాడుకు గంజాయిని తరలించే క్రమంలో పోలీసుల కంట పడి గంజాయి ప్యాకెట్లు ఉన్న బ్యాగ్‌ను ప్లాట్‌ఫామ్ పైకి విసిరేసి ఉంటారని జీఆర్‌పీ పోలీసులు అనుమానిస్తున్నారు. గంజాయిని సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు.

ముగిసిన కేజే కృష్ణమూర్తి అంత్యక్రియలు

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కేజే కృష్ణమూర్తి అంత్యక్రియలు శనివారం ముగిశాయి. కపిలతీర్థం రోడ్డులోని రామచంద్రనగర్‌లోని ఆయన నివాసం నుంచి అశ్రునయనాల నడుమ అంతిమయాత్ర హరిశ్చంద్ర శ్మశాన వాటిక వరకు సాగింది. అక్కడ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కృష్ణమూర్తి భౌతిక కాయానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, సప్తగిరి పత్రిక చీఫ్ ఎడిటర్ రాధారమణ, టీటీడీ సీపీఆర్‌వో రవి, విశ్రాంత ప్రొఫెసర్ సర్వోత్తమరావు, డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి, ఆకెళ్ల విభీషణశర్మ, ఎస్‌కేయూ ప్రొఫెసర్, బాల సుబ్రహ్మణ్యం, ఓఆర్‌ఐ డైరెక్టర్, సిబ్బంది, శ్వేత సిబ్బంది, టీటీడీ సిబ్బంది నివాళులు అర్పించారు.

భక్తులతో శ్రీవారిమెట్టు కిటకిట



చంద్రగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గం శనివారం భక్తులతో కిటకిటలాడింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. మరోపక్క కనీస వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులను టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది అదుపు చేయలేకపోయారు. దీంతో చంద్రగిరి పోలీసులు చేరుకుని వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఉదయం సమయంలో ఉచిత బస్సు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ఆటోవాలాలు ఇష్టం వచ్చినట్లు రేట్లు వసూలు చేస్తున్నారని భక్తులు వాపోయారు. టోకెన్ల ఆశ చూపి ఆటో డ్రయివర్లు ఇక్కడికి తీసుకువచ్చారని పలువురు భక్తులు చెప్పారు. టోకెన్ల కోసం కొందరు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. డిమాండుకు తగిన విధంగా టోకెన్లు ఇస్తే తమకు ఈ కష్టం ఎదురుకాదని వారు చెబుతున్నారు.

రేపు ఎల్లుండి విద్యుత్ సదస్సులు

రామచంద్రాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి సోమవారం, మంగళ వారాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఉన్నతాధికరుల ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు ఆశాఖ ఏఈ గిరి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9గంటలకు కుప్పంబాదూరు, సాయంత్రం 4గంటలకు నెత్తకుప్పం సబ్‌స్టేషన్లలో ఈఈ ఆశీర్వాదం, డీఈఈ శంకరయ్య ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు వెంకటరామాపురం, సాయంత్రం 4గంటలకు నడవలూరు సబ్‌స్టేషన్లలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తెలుగు సాహితీ సంఘాల ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం జరగనుంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి ఆసక్తి కలిగిన కవులు, రచయితలు పాల్గొనాలని నిర్వహకులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందులో పాల్గొనే వారిలో ఐదుగురు ఉత్తమ కవులను సత్కరిస్తారని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నీటిని వృథా చేయొద్దు



విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, పులికాట్ రేంజర్ నరసింహారావు, అధ్యాపకులు

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూమిపై మానవ మనుగడకు అవసరమైన ప్రధాన వనరుల్లో ఒకటైన నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌టీ శంకర్ శర్మ అన్నారు. శనివారం కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భూమిపై జలం లేకపోతే ఏ ప్రాణికీ మనుగడ ఉండదన్నారు. నీటిని కాలుష్యం గురుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు నీటి ప్రాముఖ్యతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పులికాట్ రేంజర్ నరసింహారావు విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విక్టోరియా రాణి, శ్రీనివాస్, నాగభూషణం, శరత్‌బాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం: ఈఈ



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

నాయుడుపేట టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బ్రేక్‌డౌన్‌లు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఈఈ శ్రీనివాసులు అన్నారు. శనివారం తుమ్మూరులోని సబ్ స్టేషన్‌లో వినియోగదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో పట్టణంలో ఏసీలు ఎక్కువగా వినియోగించడంతో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పొలాల వద్ద లూజ్ కనెక్షన్లు ఉన్నాయని, రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి: గురుమూర్తి

కోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ తూర్పు తీరం వాణిజ్యపరంగా శరవేగంగా అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో బకింగ్‌హామ్ కాలువను అభివృద్ధి చేయడం ద్వారా ఓడరేవులను అనుసంధానించి జలరవాణా ప్రోత్సహించవచ్చన్నారు. దీనివల్ల మత్స్యకారులు, పరిశ్రమలకు మెరుగైన రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. నౌకాశ్రయాలు, జలమార్గాల మంత్రి శర్బానంద సోనోవాల్ స్పందిస్తూ బకింగ్‌హామ్ కాలువ ప్రాధాన్యం గుర్తించామని, 420 కిలోమీటర్ల పొడవున్న ఈ కాలువ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు.

జాబ్‌మేళాలో 63మందికి ఉద్యోగాలు



నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. శనివారం కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారంతో పలు కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 63మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కాగా, వారికి నియామక పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక ప్రమాణాలు పెంచేందుకు పీ-4 సర్వే

పెళ్లకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ-4 సర్వేతో పేదల ఆర్థిక ప్రమాణాలు పెంపొందుతాయని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బంగారంపేట పంచాయతీల్లో చేపట్టిన పీ-4 సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఒబ్బు కిషోర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్, మోహనకుమారి పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీలు

కోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో తారురోడ్ల పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ జేఈలు శ్రీనివాసరావు, కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అంబేడ్కర్ గురుకులం వరకు, గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద జరుగుతున్న తారు రోడ్డు పనుల నాణ్యత, వాడుతున్న మెటీరియల్స్‌ను శాంపిల్స్ పరిశీలించారు.

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌పై శిక్షణ

కోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌పై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, గురుతేజ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మోడల్స్‌లో ప్రాంప్ట్‌ల ప్రాముఖ్యత, ప్రాక్టికల్ డెమోస్, కోర్స్ ప్రాజెక్టులకు ఉపయోగపడే చిట్కాల గురించి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

శ్మశాన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

కోట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్మశాన భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని అల్లంపాడు పంచాయతీ పీకళ్ల దిబ్బ గ్రామస్తులు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పనబాక కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి చెందిన ఇద్దరు భూస్వాములు శ్మశాన భూమిని రొయ్యల చెరువులకు కరకట్టలుగా మార్చివేశారని ఆరోపించారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకువెళ్లడానికి దారిలేకుండా అడ్డుకుంటున్నారని, శ్మశాన భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న పీకళ్లదిబ్బ గ్రామస్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తుమ్మూరు, చంద్రబాబు కాలనీ, పాత తహసీల్దారు కార్యాలయం, భరత్‌నగర్, ఎన్ఎస్ఆర్ కాలనీ, మంగపతినాయుడు నగర్, ఆర్ముగం నగర్, దర్గారోడ్డు, రాజగోపాలపురం, శ్రీరామ్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ శివశంకర్ తెలిపారు.

సెలవు రోజూ పన్నులు చెల్లించవచ్చు

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో సెలవు రోజైన ఆదివారం కూడా ఇంటి, కుళాయి పన్నులు చెల్లించవచ్చునని కమిషనర్ చిన్నయ్య తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 10నుంచి సాయంత్రం 6 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో పన్నులు చెల్లించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.

వరకట్న వేధింపులపై కేసు

కోట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గ్రామానికి చెందిన టిప్పుసుల్తాన్ కట్నం కోసం వేధిస్తున్నాడని ఆయన భార్య షేక్ దిల్‌షాద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.





జగనన్న కాలనీ పక్కన గ్రావెల్ తవ్వడంతో ఏర్పడిన గుంతలు - మన్నారుపోలూరు సమీపంలో ఓ లేఅవుట్‌కు తరలించిన మట్టి

చెలరేగిపోతున్న మట్టి మాఫియా

ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డివిజన్‌లో గ్రావెల్, మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పట్టించుకునే వారే లేకపోవడంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములు, ఇళ్ల ప్లాట్లు, పంట కాలువలను సైతం వదలడం లేదు. సూళ్లూరుపేటలో మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీ సమీపంలో ప్రభుత్వ భూములు, తెలుగుగంగ కాలువ గ్రావెల్ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకుపోయింది. 15 అడుగుల పైబడి గ్రావెల్ తవ్వేస్తుండటంతో భారీ గోతులు ఏర్పడుతున్నాయి. టిడ్కో ఇళ్ల ఎదురుగా ఉన్న జగనన్న లేఅవుట్ పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లోనూ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. అదే విధంగా ఇలుపూరు రోడ్డు పక్కన తెలుగుగంగ కాలువలను సైతం అక్రమార్కులు వదలడం లేదు. ఎక్స్‌కవేటర్ల సాయంతో కాలువలో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న లేఅవుట్ల నిర్మాణానికి గ్రావెల్, మట్టి అవసర కావడంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములు, కాలువల్లో తవ్వి తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. సమీప ప్రాంతాల ప్రజలు రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదు. దీంతో గ్రావెల్ మాఫియాకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. పట్టించుకోవాల్సిన మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం ధ్యేయం: పాశిం

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నియోజకవర్గ పరిధిలోని వెలుగు సిబ్బందితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు మొట్టమొదటగా పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలను అందించి మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పాటును అందించడమే కాకుండా వారి సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా మాట్లాడుతూ పొదుపు సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, మధుసూదన్ రెడ్డి, వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, సురేంద్ర, చిరంజీవి, భారతి, సిబ్బంది, పొదుపుసంఘాల మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య



మృతురాలు నాగమణి

వెంకటగిరి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏనుగుల పాళెం ప్రాంతానికి చెందిన బూచి నాగమణి అప్పుల బాధతో తెలుగు గంగ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ సుబ్బారావు కథనం మేరకు.. ఏడాది కాలంగా భర్తకు దూరంగా ఉంటున్న నాగమణి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. అద్దె ఇంటి ఉంటున్న ఆమె 9వ తరగతి చదువుతున్న కుమార్తె, 2వ తరగతి కొడుకు చదువుల కోసం అప్పులు చేసింది. అలాగే స్వయం సహాయక సంఘం నుంచి కొంత పొదుపు నగదు తీసుకుంది. నెలనెలా పిల్లల చదువులు, ఖర్చులు, ఇంటి అద్దె, పొదుపు సొమ్ము చెల్లింపు భారంగా మారడంతో మనస్తాపానికి గురైన నాగమణి శనివారం మధ్యాహ్నం రాపూరు రోడ్డు కలపాడు వద్ద ఉన్న తెలుగుగంగ కాలులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరకుని గాలించగా జంగలాపల్లి వద్ద మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

బిల్ కలెక్టర్ విధుల తొలగింపు

నాయుడుపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న బిల్ కలెక్టర్ రమేష్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు కమిషనర్ ఫజులుల్లా శనివారం తెలిపారు. మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల అద్దె వసూలు చేసిన రమేష్ ఆ నగదు కార్యాలయంలో చెల్లించ లేదని ఫిర్యాదు అందడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఎంసీఎఫ్ ట్రస్టు సేవలు ప్రశంసనీయం



శుద్ధిజల ప్లాంటును ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా

డక్కిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మౌనిక చారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా అన్నారు. డక్కిలి మండలం వెలికల్లు గ్రామంలో ఎంసీఎఫ్ ట్రస్టు చైర్మన్ మౌనికరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధి జల వాటర్ ప్లాంటును శనివారం సబ్‌కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత తాగు నీటిని ప్రజలకు అందించడానికి కృషి చేసన్తున్న మౌనికరెడ్డిని అభినందించారు. వెంకటగిరి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త జంపాల ప్రకాష్ మాట్లాడుతూ పదకొండేళ్ల నుంచి ఎంసీఎఫ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ట్రస్టు చైర్మన్ మౌనిక రెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఏపీలోనే కాకుండా తెలంగాణ ప్రాంతంలో కూడా సేవాకార్యక్రమాలు మొదలు పెట్టామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా సురేష్ చైతన్య



కోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన న్యాయవాది, టీడీపీ మండల అధికార ప్రతినిధి దాసరి సురేష్ చైతన్య డివిజనల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. శనివారం ఆయనను పలువురు టీడీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

పెళ్లకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉచితం మాటున సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ఎస్ఐ నాగరాజు నిఘా పెట్టారు. ముమ్మారెడ్డిగుంట నుంచి తాళ్వాయిపాడు వరకు స్వర్ణముఖినది నుంచి ప్రతిరోజు ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. దిగువచావాలి వద్ద స్వర్ణముఖినది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

టిప్పర్ బోల్తా

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆర్చి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం టిప్పర్‌కు ఆవు అడ్డురావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న నీటి కొలను గోతిలో బోల్తాపడింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా ముత్యాలమ్మ జాతర



ఏర్పాట్లను గురించి ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, పక్కన డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతరను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి అన్నారు. శనివారం మండలంలోని తూర్పు కనుపూరులో జాతర ఏర్పాట్లను పరిశీలించి వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ గీతాకుమారి, సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ సురేష్ బాబు, ఆలయ సిబ్బంది సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుకాణదారులు ప్రజలకు కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామని ఫుడ్ సేఫ్టీ అధికారిణి నర్మద అన్నారు. శనివారం పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్స్, తినుబండారాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను విక్రయించాలన్నారు. రసాయనాలతో కూడిన రంగులను, కల్తీ నూనెలను వినియోగిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతయ్య, ఏఎస్ఐ లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుంటే చర్యలు

తడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాన్ని నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొండప నాయుడు అన్నారు. శనివారం సాయంత్రం మాంబట్టు సెజ్ రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుంటే రూ.1000 జరిమానా విధిస్తామన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

నాయుడుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, కొళాయి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. శుక్రవారం బకాయిలు ఉన్న పన్ను దారులతో ఆయన మాట్లాడారు. సకాలంలో పన్నులు చెల్లించకుంటే మున్సిపాలిటీ సేవలు ఆపివేస్తామన్నారు. అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, సిబ్బంది రమేష్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును వేగవంతం చేయండి

వాకాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని వాకాడు, నిడిగుర్తి సచివాలయాల పరిధిలో రైతుల విశిష్ట గుర్తింపు నమోదు ప్రక్రియను శనివారం ప్రసాద్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలాఖరులోపు 80శాతం మంది రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. మండల వ్యవసాయశాఖ అధికారిణి దీప పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అతివేగంతో వాహనాలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను తరలించినా చర్యలు చేపడతామన్నారు. వాహనాలు నడిపే సమయంలో భద్రత నియమాలను పాటిస్తూ ప్రమాదాలకు లోనుకాకుండా వాహనాలను నడపాలన్నారు.



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

భూగర్భజలాల అభివృద్ధికి చర్యలు

చిల్లకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జాలలను అభివృద్ధి పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కమ్మవారిపాళెం పంచాయతీలో ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవంలో భాగంగా ఫారం పాండ్ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్లు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భజాలలు మెరుగుపడి నీటి ఎద్దటి నివారణకు దోహదపడుతాయన్నారు. ఉపాధి హామీ పథకంలో ఈ పనులు చేపడుతుండడంతో కూలీలకు జీవనోపాధి లభిస్తుందన్నారు. రైతులు పొలాల్లో కూడా ఫారం పాండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ధాన్యానికి ప్రభుత్వం గిట్టుధర కల్పించి 24గంటల్లో నగదు చెల్లించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతులను మోసం చేస్తే దళారులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, యదనపర్తి భాస్కర్‌రెడ్డి, పెనుబోలు జానకీ రామిరెడ్డి, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, సరుపూరు నాగేశ్వరరావు నాయుడు, నాగరాజు, శ్రీనివాసులురెడ్డి, సతీష్‌యాదవ్, నారాయణ, ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో గోపినాథ్, ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, దొరవారి సత్రం మండలాల సరిహద్దులో గుమ్మడితాగేలి వద్ద పొలాల్లో ఉన్న ఇసుక అక్రమ నిల్వలను శనివారం పోలీసు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా, మంగళంపాడు పొలాల్లో గుట్టలుగుట్టలుగా ఇసుక నిల్వలు శీర్షికన వార్త రావడంతో అధికారులు స్పందించారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, వీఆర్వో భార్గవ్ ఇసుక నిల్వలు ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. కాళంగి నది నుంచి ఇసుకను తరలించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.